ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 01, 2015
ఆ తృప్తి చాలు ! - రంగనాథ్
బరువు దించుకుందాం

తాత మనవరాళ్ళ 'దాగుడుమూత దండాకోర్'

నవ్వుల రాజేంద్రప్రసాద్ తాతయ్య అయ్యాడు. ఓ సిన్మా కోసం లెండి. పోయిన సంవత్సరం తమిళంలో 'శైవం' అనే సినిమా వచ్చింది. అందులో నాజర్, బాల నటి సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించారు. దీన్నే తెలుగులో 'దాగుడుమూత దండాకోర్'గా చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు క్రిష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆర్.కె.మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. ఇకపోతే మనవరాలిగా సారానే చేస్తుండగా తాతగా రాజేంద్రప్రసాద్ కనిపించబోతున్నాడు. మనవరాలికి వాళ్లింట్లో పెరిగే కోడికి మంచి స్నేహం వుంటుంది. చుట్టాలొచ్చినప్పుడు కోడిని కోసి విందు ఏర్పాటు చేయాలనుకుంటారు. అయితే సారా ఆ కోడిని విడిచిపెట్టేసి దాని ప్రాణాలు కాపాడడం చిత్రంలోని ప్రధానాంశం. సారా నటనను 'నాన్న'లో చూశాం కదా. ఇక పోతే రాజేంద్రప్రసాద్ సంగతి! ఈ పాత్ర తన కెరీర్‌లో మరిచిపోలేనిదిగా నిలిచిపోతుందని నట కిరీటి మాట. చూ...ద్దాం...!

మహేష్ మదర్‌గా...

'భారతీయుడు, పెద్దరికం...' లాంటి చిత్రాలతో కథానాయికగా గుర్తింపు తెచ్చుకున్న నటి సుకన్య. అది ఒకప్పటి మాట. ఇప్పుడు కొత్త అవతారం ఎత్తబోతోంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంలో మహేష్ మదర్ పాత్రకు నదియా, గ్రేసీ సింగ్ వంటి వారి పేర్లు వినిపించాయి. ఆఖరికి సుకన్య పేరు ఖరారైంది. మరో విశేషం ఏమంటే... మహేష్ తండ్రిగా జగపతి బాబు చేయనున్నాడు. సుకన్య-జగపతి బాబు జంటగా చేసిన 'పెద్దరికం' (1992) అప్పట్లో మాంచి విజయాన్నిచ్చింది. శృతి హాసన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణలో సుకన్య పాల్గొంటోంది కూడా.

మేఘన చిత్రంలో టాబు

అరుషి తల్వార్ హత్య ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. తల్లిదండ్రులే హత్య చేశారాన్న ఆరోపణ వుంది. వారిద్దరూ ప్రస్తుతం జైలుశిక్ష కూడా అనుభవిస్తున్నారు. అయితే వారిని.. అరుషి పిన్ని నిర్దోషులుగా విడిపించేందుకు కావాల్సిన సాక్ష్యాలను సమీకరిస్తోందని వినికిడి. ఈ కథతో మేఘన గుల్జార్ ఓ చిత్రాన్ని రూపొందించాలని ఉబలాటపడుతోంది. అందుకు అరుషి అమ్మానాన్నల నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అయితే చిత్రం పేరును మొదట్లో అనుకున్నట్టు 'తల్వార్' కాక 'నయోడా'గా మార్చారు. సినిమాలో అరుషి కన్నవారిగా కొంకణసేన్ శర్మ, సోహమ్ షా... పిన్నిగా టాబు కనిపించనున్నారు.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

స్టార్ట్... కెమెరా... యాక్షన్..

చెదరని క్రాఫ్! ఆకట్టుకునే మేకప్! కట్టిపడేసే కాస్ట్యూమ్స్! చుట్టూ ఫ్యాన్స్ ! 'స్టార్ట్.. కెమెరా.. యాక్షన్..' అనగానే డైలాగులు వల్లించడం! ఇవన్నీ కేవలం సినీ తారలకే! అయితే అది నిన్నటి వరకే!

ఇప్పుడు సీన్ మారిపోయింది. సితారలను తలదన్నేలా తయారౌతున్నారు పొలిటీషియన్లు. నవ్వు, నడక, మాట, బాట, అవసరమైతే ఏడుపు, విచారం ...ఒకటనేముంది? ప్రతి కదలికా! స్క్రిప్టు ప్రకారమే! సీన్ డిమాండ్ చేసిన మేరకే! డైలాగులు రాయడానికి ఒకరు. కాస్ట్యూమ్స్ డిజైన్ చేయడానికి ఒకరు. మ్యానరిజమ్స్ నేర్పడానికి ఒకరు. ఎందరో సహాయకులు. వారికోసం ఎంత డబ్బు పోయడానికైనా రెడీ!

అన్న ఎన్టీవోడితోనే ఆరంభిద్దాం. రాజకీయాల్లోకి వచ్చాక కూడా 'కెమెరా యాక్షన్'ను మర్చిపోలా. ఖాకీ ప్యాంటు చొక్కా తొడిగినా, ఖద్దరు వేసినా, కాషాయం కట్టినా, వివేకానందుడి అవతారమెత్తినా... సినిమావోడని సరిపుచ్చుకున్నా... అప్పటి నుంచే వుందీ ట్రెండు. పొరుగు సీఎం 'పురుచ్చితలైవి' స్టైయిలే వేరు. ఓ చిన్ని ముడి...భుజం చుట్టూ కప్పుకున్న చీర కొంగు... ఎక్కడికెళ్లినా ఇదే తీరు! ఇక ఇందిరమ్మది ఇంటర్నేషనల్ స్టైల్. క్రాపు, నెత్తి మీది ముసుగు..ఆవిడ ప్రత్యేకత. క్రాఫింగు, కాటన్ చీరలతో 'నాన్నమ్మ వారసురాల్ని నేనే' అంటుంది ప్రియాంక. యువరాజా వారు తక్కువా! పైజమా లాల్చీతో... పక్కింటి కుర్రాడి పాత్రలో ఒదిగిపోవడానికి అనుక్షణం కసరత్తు చేస్తూనే వుంటాడు. బీహారీ బాబు లల్లూ సెట్టింగుల కింగ్. అంటకత్తెర క్రాపు, నోట్లో పాన్, నులక మంచాలు, గేదెలు, గడ్డి...! ఓఫ్! సృజనాత్మకతలో ఆకాశమే హద్దు! సెట్టింగుల్లోనే కాదు. డైలాగుల్లోనూ కింగే! 'ఆలూ వున్నంత వరకు లల్లూ వుంటాడు' వంటి డైలాగులతో మాస్ మనసు దోచుకోవాలనుకుంటాడు.

◆ మనలో మాట

తాజా యాక్షన్ కింగులు, క్వీన్ల జాబితాలో ఒబామా దంపతులు, మోడీని చేర్చొచ్చు. పోటీ పడి మరీ ఆ విషయాన్ని రుజువు చేసేశారు... మన గణతంత్ర దినోత్సవాల్లో. మిషెల్లీ ఒబామా మామూలుగానే ఫ్యాషన్ ప్రియురాలని పేరు. ఇక ఇలాంటి సందర్భాల సంగతి చెప్పేదేముంది? రకరకాల కాస్ట్యూమ్స్‌తో దిగిపోయారు ఇండియాలో. ఆవిడ వేసుకున్న గౌను మొదలుకొని మెడకు చుట్టుకున్న స్కార్ఫ్ వరకు అన్నీ విశేషాలే. వార్తలే. అయితే పాపం ఈసారి ఆమెను బీట్ చేశారు మోడీ. ఒక్క రోజులోనే ఎన్ని కాస్ట్యూమ్స్ వేసుకున్నారనీ! సూటు బూటు, తల పాగా, పైజమా కుర్తా, షాల్, మోడీ అని రాసిన కోటు ...ఎన్నని చెప్పాలి? ఇది చూసి మీడియానే తెగ హా...శ్చర్యపోతేను. ఇంత బిజీగా వుండి కూడా అన్ని రకాల కాస్ట్యూమ్స్ ఎలా మార్చారూ? అని.

ఒక్క దెబ్బకి రెండు పిట్టల్లా... మాస్‌ని...మీడియాని ఒకేసారి పడేయాలంటే... నిరంతరం... అనుక్షణం... యాక్షన్లోనే వుండాలని వీరంతా డిసైడయ్యారేమో!

■



టపా

ఇలాంటి కథనాలు కావాలి

జనవరి 18, ఆదివారం స్నేహ లో వచ్చిన కథనాలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా కలర్ పేజీల్లో పాఠకుల మనసుకు నచ్చే విషయాలు చెబుతున్నారు. 'దీపం' కథలో ఉపాధ్యాయవృత్తి నిబద్ధత గురించి తెలియచేయడం బాగుంది. జీవితం శీర్షికలో లంచ్ బాక్స్ బామ్మ, చిప్స్ మామ్మ కథనాలు బాగా నచ్చాయి. ఇలాంటి కథనాలు ప్రతివారం ఇస్తే బాగుంటుంది. రుచిలో సోయా స్పెషల్ వంటకాలు చదివాక, సోయాతో ఇలాకూడా చేయచ్చా అనిపించింది. ప్రతి వారం వస్తున్న ప్రేమ విప్లవం సీరియల్ ఒక పుస్తకంగా ప్రచురిస్తే బాగుంటుంది.

-కె. రమాదేవి, నెల్లూరు

ఆకట్టుకున్న కథానాయకుని కథ

కథానాయకుని కథ' కవర్ స్టోరీ చదువుతుంటే రామారావు జీవితం నుండి చాలా విషయాలు నేర్చుకోవచ్చనిపించింది. సినిమా రచన తానే సొంత దస్తూరితో రాయడం, సమయపాలన ఆయనలోని గొప్ప లక్షణాలు. మొత్తంగా ఈ కథనం ఆకర్షణీయంగా కూడా అనిపించింది. ఆరోగ్య సూత్రాల గురించి తెలియచేసినందుకు సంతోషం. కవితలు బాగున్నాయి. మనం వాడే రకరకాల దినుసులు ఏ దేశాలనుండి పరిచయమయ్యాయో చదువుతుంటే ఆసక్తిగా అనిపించింది.

- సత్యవతి, ఏలూరు

'మాట' నవ్వించింది!

తలాడించినందువల్ల పై వారు సంతోషపడతారుగాని, తల ఆడించిన వారిని చూచేవారు నవ్వుకుంటారని 'మనలో మాట' చదివినవారికి బోధపడుతుంది.

సంక్రాంతి పల్లె-పట్నమనే తేడాలేకుండా ప్రజలు చేసుకునే కొత్త పంటలు, వంటకాల పండుగ. ఎ.కె.రామానుజన్‌గారు ఇచ్చిన 'రేచీకటి అల్లుడు' కథ బాగుంది. ఈ కథ హాస్యాన్ని ఇస్తూనే రేచీకటి అల్లుడు పడుతున్న ఇబ్బందులకు బాధ కలిగించింది. అతి ప్రాచీనమైన ఆంకోర్ వాట్ కట్టడం గురించి చదివినపుడు ఆనాటి రాజులు ప్రజలకు "ఉపాధి కల్పన"కు తీసుకున్న చర్యలు తెలుస్తున్నాయి. 300 సంవత్సరాలు పట్టే కట్టడమును 40 ఏళ్లలో పూర్తి చేయడం గొప్ప విషయం.

ఇలిపిల్ల సూర్యనారాయణ
భీమనవారిపేట. విజయవాడ

నౌక చరిత్ర గొప్పది

వాసా యుద్ధనౌక 10-8-1628న పోలాండ్ పై యుద్ధానికి బాల్టిక్ సముద్రపు జలాల్లోకి ప్రవేశించింది. బయలుదేరిన 20 నిమిషాలలో నీటమునగటం దురదృష్టం. వందలాది మంది జలసమాధి అయ్యారు. ఇది ప్రపంచ చరిత్రలో తీవ్ర సంఘటన. 1950లో అనగా 333 ఏళ్ల తరువాత స్వీడన్ ప్రభుత్వం ఆ నౌకను 18 లిఫ్టుల సాయంతో బయటకు తీసింది. ఇపుడు ఆ నౌక వయస్సు 388 ఏళ్లు. చారిత్రక విషయాలు తెలియచేయడం బాగుంది.

-టి.శ్రీరామమూర్తి
గాజువాక. విశాఖపట్నం.

ఆకట్టుకుంటున్న సీరియల్

ప్రతి వారం వస్తున్న ప్రేమ విప్లవం సీరియల్ ఆకట్టుకుంటుంది. మార్క్స్, జెన్నీల ప్రేమ కథ నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం. విప్లవం కోసం ఎంగెల్స్, మార్క్స్ కృషి అనిర్వచనీయమైనది.

-సిహెచ్ రాయుడు,
కళ్యాణ దుర్గం, అనంతపురం జిల్లా

ఈ సంచికలో....

బరువు దించుకుందాం

కవర్‌స్టోరీ ———— 14

ఆరోగ్య సమస్యలకు హేతువు...జబ్బులకు చిరునామా ... వ్యాధుల పుట్ట...నూరేళ్ల ఆయుష్షుకు గండం...ఊబకాయం. ఇది ఎన్నో శారీరక, మానసిక సమస్యలకు పుట్టినిల్లు అవుతోంది. నేడు స్థూలకాయం సమస్య సమాజానికే పెనుసవాల్‌గా పరిణమిస్తోంది. గజిబిజి జీవనశైలి, బొత్తిగా ఒంటికి వ్యాయామం లేకపోవటం, గతితప్పిన ఆహారపు అలవాట్లు వెరసి అధిక బరువును పెంచిపోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికబరువు దించుకోవడం ఎలానో ఇవాళ్టి అట్టమీది కథలో తెలుసుకుందాం!

స్ఫూర్తి 3
ఈ పనులన్నీ నీకెందుకన్నారు

టెక్ గురు 4
పాఠశాల పిల్లాడు అంధులకో ప్రింటర్ చేశాడు

యువ 5
యువత భాగస్వామ్యంతోనే...

కథ 6
థ్యాంక్స్ నాన్నమ్మ

వింత లోకం 7
బాడీ నాది పచ్చబొట్టు మీది

సినిమా కబుర్లు 8
ఆ తృప్తి చాలు!

కొత్త పుస్తకాలు 10
బహుముఖ స్వర్శ

చూద్దామా 12
వింత జంతువులకు 'మసాయి మారా'

సీరియల్ 18
ప్రేమ విప్లవం

సమ్‌థింగ్ స్పెషల్ 21
ముందు ఉరి... తదుపరి విచారణ...

బాలనేస్తాలు 22
తెలుగు పదాలతో ఆట

రుచి 24
ఊరించే రసాలు

ఈ పనులన్నీ నీకెందుకన్నారు

అసలు పేరు ఉమామహేశ్వరి. కుంచె పేరు అంజలి దాస్. తెలిసినవారు మాత్రం మొండి అమ్మాయి అంటారు. కాన్వాసుపై కుంచె పట్టుకునే సత్తువ చేతులకు లేదు. కాని...పనికిరాని చేతులతోనే పల్లెసీమ అందాలను చిత్రించాలనే తపన. జీవితంలో తను కోల్పోయిన అనుభూతులను తాను గీసే బొమ్మల్లో చూసుకోవలనే కోరికే... ఆమెకు ప్రేరణ. 'నీచేత్తో నీవు అన్నమే సరిగ్గా తినలేనిదానివి బొమ్మలేస్తావా' అన్న హేళన నుండి స్ఫూర్తి పొందిన వర్థమాన చిత్రకారిణి అంజలి.

చిన్నప్పటి నుండి నాకు ఒక ప్రత్యేకమైన రంగంలో రాణించాలని కోరిక. కానీ మా పెద్దలకు నన్ను ఇల్లుదాటి బయటకు పంపాలంటే భయం. కారణం నా పనులు నేను చేసుకోలేను. నాకు 80శాతం పోలియో. కాళ్లు, చేతులు పెద్దగా సహకరించవు. ఏ పని చేయాలన్నా కష్టమే. కానీ అమ్మకు నన్ను బాగా చదివించాలని కోరిక. బహుశా అమ్మ ఇచ్చిన ధైర్యంతోనే బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ఆర్ట్ పెయింటింగ్ విభాగంలో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసాను. ఇల్లువదిలి ఒక్కరోజు కూడా ఉండని నేను, లక్ష్య సాధన కోసం అయినవారందరికీ దూరంగా ఉంటున్నాను. నా పెయింటింగ్స్ అన్నీకలిపి సోలోగా ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించాను. గతేడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు దేశ వ్యాపితంగా నలభై మంది చిత్రకళాకారిణిల పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో నేను గీసిన చిత్రానికి స్థానం దక్కింది. వీటన్నిటి వెనుక నా కృషి కన్నా, అమ్మ ప్రోత్సాహమే ఎక్కువ.

నీవు పనికిరావు అన్నారు

మా స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలు. మధ్య తరగతి కుటుంబం. ముగ్గురు అక్కచెల్లెళ్లం. వారిలో నేనే పెద్ద. నాకు నాలుగేళ్ల వయస్సున్నప్పుడు మా నాన్న చనిపోయారు. ముగ్గురూ ఆడపిల్లలే. అందులో ఒకరు అవిటి. జీవితాన్ని ఎలా నెట్టుకొస్తుందోనని అమ్మ గురించే తాతయ్య, మామయ్య దిగులు అంతా. తర్వాత మా కుటుంబానికి వారే అండగా నిలిచారు. కొంత కాలం గడిచాక అమ్మకు రైల్వేలో అటెండర్ ఉద్యోగం వచ్చింది. ఇంకేమి ఫర్వాలేదు. కుటుంబానికి ఆధారం దొరికింది. ముగ్గురు కూతుళ్లకు పెళ్లి చెయ్యడమే నీ బాధ్యత అని బంధువులంతా అమ్మకు సలహాలిచ్చేవారు. అమ్మ మాత్రం వాటిని లెక్కచేసేది కాదు. ఫైన్ఆర్ట్స్ చదవటానికి హైదరాబాద్ వెళుతుంటే, 'అన్నమే తినలేని చేతులతో బొమ్మలు గీస్తుందా' అని హేళనగా మాట్లాడారు ఇరుగుపొరుగు వారు. పెయింటింగ్ రెండో ఏడాది చదువుతుండగా కాలేజీలో మెట్లు ఎక్కుతూ పడిపోయా. చెయ్యి బెణికింది. డాక్టరు రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాలన్నారు. మా లెక్చరర్ ఒకరు మా ఇంటికి ఫోన్ చేసి మీ అమ్మాయిని తీసుకెళ్లండి. అసలు అంజలి పెయింటింగ్ రంగానికి పనికిరాదు. అనవసరంగా ఈ కోర్సులో చేర్పించారు అంటూ అమ్మ,మామయ్యలతో చెప్పారు. మామయ్య నన్ను చదువు మానేసి ఇంటికి రమన్నారు. అమ్మ మాత్రం ఆమాటలు పట్టించుకోలేదు. మా లెక్చరర్ దగ్గరకు వెళ్లి నేను గీసిన పెయింటింగ్స్ అన్నీ చూపించి, మా అమ్మాయి బొమ్మలు బాగా వేయగలదండీ! అని చెప్పింది. అమ్మ మాటలు నాకు మరింత ధైర్యాన్నిచ్చాయి. కొన్ని రోజుల విశ్రాంతి తర్వాత కాలేజీలో చేరా. నన్ను చూసిన మా లెక్చరర్ నీవు మొండిదానివి అన్నారు. మెట్లు ఎక్కలేక, నడవలేక చాలా సార్లు కాలేజీ మెట్లపై పడిపోయా. పడినా మళ్లీ లేచి నడిచేదాన్ని. వెనక్కి కాదు. ముందుకు. నన్ను ఈ రంగానికి పనికిరావు అన్న లెక్చరర్‌గారే నా మొదటి ఆర్ట్ ఎగ్జిబిషన్ కు ముఖ్యఅతిథిగా వచ్చారు.

మిస్సింగ్ లైఫ్

మొదట ఆ కుంచె బ్రెష్ కూడా పట్టుకోలేకపోయేదాన్ని. తర్వాత అలవాటయింది. బొమ్మలు వేసాను. నా బొమ్మలు చూసిన వారందరూ బాగున్నాయని మెచ్చుకునేవారు. ఒకసారి రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నాను. మొదటి బహుమతి వచ్చింది. దాంతో జిల్లా పేపర్లో నాగురించి రాసారు. ఆ వార్త చదివిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అనే ఎన్.ఆర్.ఐ, నా చదువుకు ఆర్థిక చేయూతనందించారు. నాలుగేళ్ల కోర్సు పూర్తయ్యాక, నేను గీసిన చిత్రాలన్నింటితో సొంతంగా ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలనుకున్నా. అందుకు కొంత డబ్బుఖర్చు అవుతుంది. ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు సహకారంతో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సోలోగా ప్రదర్శన నిర్వహించా. తర్వాత శిల్పారామంలో కూడా స్టాల్ పెట్టాను. అక్కడకు వచ్చిన విదేశీ సందర్శకులు చాలామంది నా పెయింటింగ్స్ చూసి అభినందించారు. ఆ చిత్రాల్లో కనిపించిన మన గ్రామీణ వాతావరణం వారిని ఆకట్టుకుంది. నేను గీసే బొమ్మల్లో నులకమంచం, నీళ్లబిందె మోసుకెళుతున్న గ్రామీణ మహిళ, ఆవకాయ పెడుతున్న అమ్మ, ఉట్టిమీద పెరుగు ముంత...ఇలా ఒకనాటి పల్లెటూరి వాతావరణం అంతా ఆ చిత్రాల్లో కనిపిస్తుంది. నేను జీవితంలో చేయలేకపోతున్న పనులు, చాలా మందికి దూరమయిన అసలుసిసలైన పల్లె వాతావరణం...ఇవే నా కుంచె నుండి వెలువడే ముఖ్య పాత్రలు. జీవితంలో డాన్స్ చేయలేకపోతున్నాననే బాధ నుండి పుట్టిన చిత్రమే డాన్సింగ్ డాల్.

చెప్పకోవడానికి బాగుంటాయి

బొమ్మలు గీస్తాను అని చెప్పుకోవటానికి బాగానే ఉంటుంది. కానీ బతుకుదెరువు సంగతికి ముడిపెడితే కష్టమైన పనే అనిచెప్పాలి. అందులోనూ నాలాంటి మధ్య తరగతి వాళ్లకు మరీను. రోడ్డుకూడా దాటలేని నేను ఎన్నో సార్లు పెయింటింగ్ స్టాల్ అనుమతి కోసం చాలా మంది ప్రభుత్వ అధికారులను కలిసాను. స్పందించే అధికారులు నాకు ఇంతవరకూ తారసపడలేదు. కొంత మంది అమ్మా, ఇవన్నీ నీకెందుకు అని ఉచిత సలహాలు మాత్రం ఇచ్చేవారు. మాకు జాలికాదు కావాల్సింది. మా ప్రతిభకు తగ్గ ప్రోత్సాహం.

- అనిత కారుసాల

పాఠశాల పిల్లాడు అంధులకో ప్రింటర్ చేశాడు

అంధులకు కళ్ళు మూసినా, తెరచినా అంతా కటిక చీకటే. అలాగని పాఠశాలలకు, పుస్తకాలకు, విజ్ఞానానికి దూరంగా వుండలేరుగా. వారూ అందరిలా పుస్తకాల ప్రపంచంలో విహరించాలని, విజ్ఞానపుటంచులు స్పృశించాలని ఆశించడం సహజం. వారి కోరిక నెరవేరాలంటే... బ్రెయిలీ లిపిలో అచ్చయిన పుస్తకాలు అందుబాటులో వుండాలి. అలా వుండాలంటే... వాటి ముద్రణకయ్యే ఖర్చు తక్కువగా వుండాలి. అప్పడే చవగ్గా పుస్తకాలు అందుతాయి. ఈ ఆలోచన చేసింది తల పండిన మేధావులు కాదు. పాఠశాల విద్యనభ్యసిస్తున్న శుభమ్!

శుభమ్ బెనర్జీ! క్యాలిఫోర్నియాలో స్థిరపడిన భారతీయ కుటుంబానికి చెందిన చిన్నారి. శాన్ జోస్ పాఠశాలలో సెవన్త్ గ్రేడ్ చదువుతున్నాడు. ఎప్పటిలాగే ఆరోజు కూడా స్కూల్ నుంచి ఇంటికి వెళ్తుండగా.. అంధులకోసం నిధులు సేకరిస్తున్న కొందరు కనిపించారు. ఆ తర్వాత ఇంటికి వెళ్లాక కూడా వారి గురించే ఆలోచన. ఎంతగా అంటే.... తింటున్నా... ఆడుకుంటున్నా...ఏం చేస్తున్నా అంధుల గురించే ఆలోచన. 'వారికి కనబడదు కదా. మరి వారు ఎలా చదువుకుంటారు...?' ఇలా రకరకాల ప్రశ్నలు శుభమ్‌ను వేధించసాగాయి.

ఆ విషయాన్నే అమ్మానాన్నలను అడిగితే గూగుల్‌లో చూడమన్నారు. అలా అంధులపై అతని పరిశోధన మొదలైంది. అంధులు బ్రెయిలీ లిపి ద్వారా చదువుతారని తెలుసుకొన్న శుభమ్ బ్రెయిలీ లిపిలో పుస్తకాల ముద్రణకు ఉపయోగించే ప్రింటర్ల ఖరీదు కూడా ఎక్కువని అర్థం చేసుకున్నాడు. అసలే వైకల్యంతో బాధపడుతున్న వాళ్లకు అలా ప్రింటర్ల ధర, పుస్తకాల ధర కూడా ఎక్కువగా ఉండడం ఏమిటా అన్న ఆలోచనలో పడ్డాడు. వారికోసం తక్కువ ఖర్చులో అందుబాటులో వుంటే బావుంటుందనుకున్నాడు. బ్రెయిలీ ప్రింటర్ రూపకల్పనకు పూనుకున్నాడు.

బ్రెయిలీ ప్రింటర్ ఎలా పని చేస్తుందనే విషయం గురించి పరిశోధించాడు. ఓ పక్కన స్కూల్లో ఇచ్చిన ఎసైన్‌మెంట్లు చేసుకొని, ఆ తరువాత తను అనుకున్న పని సాధించడం కోసం కుస్తీలు పట్టేవాడు. ఈ చిన్న కుర్రాడు ఒక్కో రోజున అర్థరాత్రి 2 గంటల దాకా మెలకువగా ఉండి మరీ పని చేసేవాడు. చివరకు తక్కువ ఖర్చులో బ్రెయిలీ ప్రింటర్ నమూనాను రూపొందించాడు. "నా ఊహల్లోని ప్రింటర్‌కు నా తల్లితండ్రుల సహకారంతో ఒక రూపాన్నిచ్చాను. అది విజయవంతమైంది. ఇంకో విషయం ఏమిటంటే.. ఇది పెద్ద ఎత్తున పుస్తకాల తయారీకి ఉపయోగపడదు. ఎవరికి వారు తమ కంప్యూటర్‌కు కనెక్ట్ చేసుకొని ప్రింట్ తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ కిట్ గురించి పూర్తి వివరాలు నా వెబ్‌సైట్‌లో ఉన్నాయి' అంటాడు శుభమ్. తన తండ్రి దగ్గర్నుంచి 35వేల డాలర్లు తీసుకొనిపోయిన వేసవిలో కేవలం 20వేల రూపాయలకి అందుబాటులో వుండేలా లీగో రోబోటిక్స్ (పిల్లలు ఆడుకునే బ్రిక్స్)తో ఓ ప్రింటర్ తయారు చేసి కంపెనీ పెట్టాడు. దానికి బ్రెయిగో ల్యాబ్స్ అని పేరు పెట్టాడు.

త్వరలో బ్రెయిలీ ప్రింటర్‌ను తక్కువ ధరలో మార్కెట్లో విడుదల చేయాలన్నదే ఇతని కోరిక. ఈ మధ్య అమెరికాలోని ఓ సైన్స్ ప్రదర్శనలో శుభమ్ తన నమూనాను ప్రదర్శించినప్పుడు అందరూ ఆసక్తిగా గమనించారు. చూపు లేనివారికి ఉపయోగపడే ఈ కారుచౌక ప్రింటర్ ఇప్పుడు పెద్ద సంచలనమైంది. అమెరికన్ మీడియా అంతా చిన్న వయసులోనే పెద్ద మేధావి అంటూ ప్రశంసల జల్లు కురిపించింది.

ఖరీదు తక్కువ!

సాధారణంగా ఒక బ్రెయిలీ ప్రింటర్ ఖరీదు లక్ష ఇరవై వేల రూపాయల వరకూ ఉంటుంది. అయితే శుభమ్ బెనర్జీ రూపొందించిన మోడల్ ప్రింటర్ ఖరీదు కేవలం ఇరవై వేల రూపాయలకే అందుబాటులో ఉంటుంది. దాని పేరు 'బ్రెయిగో' అంధులకు లిపిని రూపొందించిన లూయీ బ్రెయిలీ పేరు, అందుకు సంబంధించిన ప్రింటర్ లెగో పేరు కలుపుతూ తన కొత్త ప్రింటర్‌కు 'బ్రెయిగో' అని పెట్టాడు.

శుభమ్ బెనర్జీ పెట్టిన ఈ కంపెనీలో ముందు తన తల్లికే ఉద్యోగం ఇచ్చాడు. అంతేకాదు బయట కంపెనీల నుంచి కూడా ఈ కంపెనీకి పెట్టుబడులు వస్తున్నాయి. దిగ్గజ టెక్నాలజీ, కంపెనీలైన ఇంటెల్ కార్ప్ పెట్టుబడి పెట్టాయి. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన శుభమ్ బెనర్జీ అందరి అభినందనలు అందుకున్నాడు. ఈ బాలుడు చేపట్టిన ప్రాజెక్టుకు నిధులందించేందుకు పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు సిద్ధంగా ఉన్నారట.

- అనంతోజు మోహన్‌కృష్ణ



యువత భాగస్వామ్యంతోనే...

ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండాలో తెలుగువారికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి. కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, కార్మిక, కర్షక లోకానికి గొంతుకైన మహానేత. పరస్పరదాడులకే పరిమితమవుతున్న చట్టసభల్లో ప్రజల వాణి వినిపించిన జన నేత. విప్లవమే ఊపిరిగా, విప్లవమే శ్వాసగా ఊపిరున్నంత వరకు అరుణ రాజ్యం కోసం పరితపించి పనిచేసిన గొప్ప మనీషి పుచ్చలపల్లి సుందరయ్య. 1982 ఏలూరులో జరిగిన డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభ ప్రారంభోపన్యాసంలో సుందరయ్య గారు యువజన సంఘాల బాధ్యత, యువత లక్ష్యాల గురించి చెప్పిన మాటలు ఇవి.

మన యువజనులు చక్కని అలవాట్లతో జీవితం గడుపుతూ ప్రజలకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా నిలుస్తూ ఆదర్శప్రాయులుగా నిలవాలి. ప్రపంచ వ్యాపితంగా మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ వంటి మహోపాధ్యాయులు చేసిన పాఠాలు, చరిత్ర మిగిల్చిన గొప్ప వ్యక్తుల అనుభవాలు యువజనోద్యమానికి అనువర్తింపచేయడం ఎంతో అవసరం. కమ్యూనిస్టు పార్టీగా బహిరంగంగా పనిచేసేందుకు అవకాశం లేని పరిస్థితుల్లో మేము యువజన సంఘాలను వేదికగా చేసుకుని పనిచేశాం. గత యాభై ఏళ్లలో మా తప్పొప్పులు, సాధించిన విజయాలు, చేసిన త్యాగాలు ఇవన్నీ నేటి ఉద్యమ కార్యకర్తలు అర్థంచేసుకోవాలి. ప్రజా సంఘాలు ఏ పార్టీకి అనుబంధం కావు. ఆయా వర్గాలకు చెందిన ప్రజలు, తమ దైనందిన సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘటితం అయ్యేందుకు ఏర్పాటు చేసుకునే సంఘాలే ప్రజా సంఘాలు. యువజన సంఘాలు బహుళ వర్గాలతో కూడినవి. అన్నిరకాలైన యువజనులు దీనిలో వుండవచ్చు. రాజకీయ కులమత తేడాలు లేకుండా ఎవరైనా రావచ్చు. మార్క్సిస్టు పార్టీకి చెందిన వారు యువజనులను తమ వైపుకు తెచ్చుకోవాలంటే సమస్యలపై సేవచేసి ఆకర్షించాలే గాని శాసనాలు జారీ చేసినంత మాత్రాన ఎవరూ ఏ పార్టీవైపుకు రారు. యువజన సంఘాల కార్యకర్తలు ఆదర్శ ప్రాయమైన జీవితాన్ని గడపాలి. సమస్యల పరిష్కారానికై కృషిలో ముందుండాలి. తాము నివసించే ప్రాంతంలో ఏ చిక్కులు వచ్చినా నడుంబిగించాలి. రంగంలోకి దిగాలి. తమ కుటుంబాలలో స్త్రీలను గౌరవంగా చూడాలి. వారి విద్య, వికాసాలకు, విశ్రాంతికి చిత్తశుద్ధితో దోహదపడాలి. ప్రమాదాలు, విపత్తులు వచ్చినప్పుడు ముందు పీఠిన నిలిచి ఆదుకోవాలి. ఆ విధంగా తక్కిన ప్రజల కన్నా మెరుగైన జీవితాన్ని గడిపినపుడే ఆశయాలు సాధించగలుగుతాం.

శరీరదారుఢ్యాన్ని పెంచుకోవడానికి యువకులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. శారీరక బలం లేనివారు ప్రజలను ఆదుకోవడం మాట అటుంచి, ఆత్మరక్షణ కూడా చేసుకోలేరు. “వివిధ తరగతుల ప్రజలు సమస్యలపై సాగించే న్యాయమైన పోరాటాలకు యువజనులు పూర్తిగా సహకరించి అండగా నిలవాలి.

> **“వివిధ తరగతుల ప్రజలు సమస్యలపై సాగించే న్యాయమైన పోరాటాలకు యువజనులు పూర్తిగా సహకరించి అండగా నిలవాలి. అన్యాయాలు, అరాచకాలు, అత్యాచారాలు ఎక్కడ జరిగినా ధైర్యంగా ప్రతిఘటించాలి. కాలం చెల్లిన మూఢ విశ్వాసాలను, మూర్ఖత్వాన్ని పారద్రోలాలి”. కళా, సాహిత్య రంగాలలో కూడా యువజనులు అభిరుచి పెంచుకోవాలి. నైపుణ్యం సాధించాలి.**

అన్యాయాలు, అరాచకాలు, అత్యాచారాలు ఎక్కడ జరిగినా ధైర్యంగా ప్రతిఘటించాలి. కాలం చెల్లిన మూఢ విశ్వాసాలను, మూర్ఖత్వాన్ని పారద్రోలాలి”.

యువతులను సమీకరించడానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వనిదే మన కర్తవ్యం పూర్తికాదు. యువజన సంఘాల కార్యకర్తలు కుంటుంబాలలో స్త్రీలను సంఘాలలో ఎందుకు చేర్చరు? వరకట్న సమస్యను గట్టిగా ఎదిరించాలి. వరకట్నం కోసం బలవంత పెట్టే వారిని యువతులు బహిష్కరించాలి. కట్నాల కోసం పీడించే వానిని ప్రతిఘటించాలి. అవసరమైతే బయటకు రావడానికి కూడా సిద్ధపడాలి. అలాంటి యువతులకు సామాజికంగా చేయూతనివ్వాల్సిన బాధ్యత మన సంఘంపైనా, యువజనులపైనా ఉంది. వరకట్న దురాచారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసించడంతోపాటు ఈ రీతిగా యువతరం తనపై గల కర్తవ్యాన్ని కూడా నిర్వహించాలి. కళా, సాహిత్య రంగాలలో కూడా యువజనులు అభిరుచి పెంచుకోవాలి. నైపుణ్యం సాధించాలి. ప్రజల సేవకు సర్వదా సిద్ధంగా ఉండాలి. యువజన సంఘం ఒక విస్తృత ప్రజాతంత్ర వేదిక కనుక ఆ ప్రాతిపదికనే యువజనులను సమీకరించాలి. నిజమైన ప్రజా రాజ్యం అంటే సోషలిజం తప్ప మరొకటి కాదు. మన దేశం ఎదుర్కొంటున్న దారిద్ర్యం, నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కారానికి మార్గం సోషలిజమేనని చరిత్ర రుజువు చేసింది. మన దేశంలో సోషలిజం సాధన కోసం పనిచేసే సంఘాలు, పార్టీలు ఉన్నాయి. యువజన సంఘాలు వాటిలో భాగస్వాములై ఆ లక్ష్యం వైపు యువ జనులను నడిపించాలి.

థ్యాంక్స్ నాన్నమ్మ

సత్యవతి దినవాహి
09790752180

రాత్రి సమయం 9.10 నిముషాలు అయ్యింది. అక్కడక్కడా ఒకటి రెండు వీధి దీపాలు తప్ప అంతా చీకటి. రాబోయేది అమావాస్య కూడా కావటంతో ఎక్కువ వెలుగు కూడా లేదు. ఆరోజు ఆదివారం అవడం, రమ్య వాళ్ల ఇల్లు విశాఖపట్నం శివార్లలో కొత్తగా వస్తున్న కాలనీలో ఉండటంవల్లనూ వీధి అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. కొంచెం భయంవేసినా నాన్నమ్మ పరిస్థితి గుర్తుకు వచ్చి ధైర్యం తెచ్చుకుని ముందుకు అడుగు వేసింది. నడుస్తోందిగానీ రమ్య మనసులో గత గంటలో జరిగిన ఆకస్మిక పరిణామం గుర్తుకువచ్చి మనసు కలచినట్లయ్యింది.

◆ ◆ ◆

మామయ్యకు ఆరోగ్యం బాగాలేదని కబురు వస్తే చూడటానికి అమ్మ, నాన్న ఊరెళ్లి రెండు రోజులయ్యింది. తనకు నాలుగు రోజుల్లో ఇంటర్నల్ పరీక్షలు ఉండటం వల్ల తాను రానని, అదీగాక నాన్నమ్మ ఒక్కర్తే ఉంటుంది కాబట్టి తాను ఆవిడకి తోడుగా ఉంటానని రమ్య అనటంతో, ఆమె తల్లిదండ్రులిద్దరూ సాధ్యమైనంత త్వరగా వచ్చేస్తామని, జాగ్రత్తగా ఉండమని చెప్పి వెళ్లారు.

భోజనం తరువాత నాన్నమ్మ భగవద్గీత చదువుకుని పడుకుంటానంటే సరేనని రమ్య తన గదికి వచ్చేసింది చదువుకోవటానికి. రమ్యకి నాన్నమ్మ అంటే చాలా ఇష్టం. చిన్నప్పటినుంచీ ఆవిడ దగ్గరే ఉండటంతో రమ్యకి ఆవిడ దగ్గర చనువు ఎక్కువ. తాతగారి మరణం తరువాత నాన్నమ్మ ఒంటిరితనం దూరం చేసే ప్రయత్నంలో రమ్య ఆవిడకి ఇంకా దగ్గరయ్యింది. పక్కగదిలోంచి సన్నగా మూలుగు వినిపిస్తుండటంతో ఏమిటా అని చూడటానికి వెళ్లిన రమ్యకి, నాన్నమ్మ పొట్టమీద చెయ్యి వేసి నిమురుకుంటూ అసహనంగా మంచంపైన అటూఇటూ కదలడం కనిపించింది.

"ఏమైంది నాన్నమ్మా, ఏదైనా బాధగా ఉందా?" ఆందోళనగా అడిగింది రమ్య.

"కడుపులో విపరీతంగా నొప్పిగా ఉందమ్మా" అంది ఆవిడ బాధతో పంటిబిగువున.

రమ్యకి ఒక్క క్షణం ఏమి చెయ్యాలో తోచలేదు. తన దగ్గర కడుపు నొప్పి మాత్ర ఉందిగానీ అది ఇద్దామంటే ఆవిడకి ఎలాంటి మాత్రలూ సరిపడవని తండ్రి చెప్పటం గుర్తుకురావడంతో ఆ ప్రయత్నం విరమించుకుంది.

తమ ఫ్యామిలీ డాక్టరుగారికి ఫోన్ చేద్దామని చూస్తే ఫోన్లో నెట్‌వర్క్ లేదు. అందరి దగ్గరా సెల్ ఫోన్లు ఉండటంతో ఇంట్లో లాండ్ లైన్ అవసరంలేదని పెట్టించలేదు తన తండ్రి. తాము ఉండే రెండు వీధులకి అవతలే డాక్టరుగారి ఇల్లు.

"నాన్నమ్మ! నేను వెళ్లి డాక్టరుగారిని పిలుచుకుని వస్తాను, అప్పటిదాకా కొంచెం ధైర్యంగా ఉండు" అని చెప్పి, ఇంటికి తాళం వేసి బయలుదేరింది.

ఆలోచిస్తూ నడుస్తున్న రమ్యకు ఏవో మాటలు వినిపించి వెనక్కి తిరిగి చూసి, తనని ముగ్గురు అబ్బాయిలు వెంబడిస్తున్నట్లు గమనించింది. ఈ మధ్య అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలు గుర్తుకువచ్చి ఒక్కసారిగా భయంవెయ్యడంతో నడక వేగం పెంచింది.

వాళ్లు తన దగ్గరకి వచ్చే లోగానే తను ఏదో ఒకటి చెయ్యాలి అని ఆలోచిస్తూ ఫోన్ వైపు చూసింది. అదృష్టం కొద్దీ నెట్‌వర్క్ ఉంది. గబగబా వాట్స్ యాప్‌లో రమ్య తన పరిస్థితి, తాను ఎక్కడ ఉన్నదీ తన గ్రూపు వాళ్లందరికీ మెసేజ్ పంపించింది. తన మెసేజ్ చూసి ఎవరైనా వచ్చేలోగా ఆత్మరక్షణకి పర్యాయ మార్గాలు వెతుకుతుండగానే ఆ ముగ్గురూ రమ్యని చుట్టుముట్టేశారు.

అందులో ఒకడు రమ్య చేతిలోని ఫోన్ లాగేసుకున్నాడు. ఇదంతా జరుగుతుండగానే రమ్య కళ్ల చివరనించి వాళ్ల ముగ్గురినీ గమనించింది. అందులో ఒకడు మాత్రమే కొంచెం బలంగా ఉన్నాడు. మిగతా ఇద్దరూ సన్నగా రివటల్లా ఉన్నారు. ఆ బలంగా ఉన్నవాడే ఫోన్ లాక్కున్నాడు. వాడే మళ్లీ రమ్య చెయ్యి పట్టుకుని లాగుదామని ముందుకు అడుగు వెయ్యబోయేంతలో వాళ్లెవరూ ఊహించని విధంగా రమ్య పిడికిలి బిగించి ఆ లావుగా ఉన్నవాడి పక్కటెముకలపై బలంగా ఒక గుద్దు గుద్దింది. అకస్మాత్తుగా తనపై జరిగిన దాడికి తయారుగా లేని వాడు ఆ దెబ్బకి "అమ్మా!" అంటూ పొట్ట పట్టుకుని బాధతో కిందపడ్డాడు.

దాంతో కోపంతో రెచ్చిపోయిన మిగిలిన ఇద్దరూ రమ్యపై కలియబడ్డారు. రమ్య శరీరం కొంచెం దృఢమైనది కావడంతో అందులో ఒకడి చెయ్యి దొరక బుచ్చుకుని, వాడి రెండు కాళ్ల మధ్యలో బలంగా తన్నింది. దాంతో వాడు కిక్కురమనకుండా నేలకొరిగాడు. ఇదంతా చూసి మూడోవాడు కొంచెం జంకి వెనకడుగు వేసినప్పటికీ తన మెడమీద పడబోయిన రమ్య చేతి దెబ్బ నించి తప్పించుకోలేకపోయాడు. ఇంతలో రమ్య ఇచ్చిన సమాచారం వాట్స్‌యాప్‌లో చూసి ఆమె అన్నయ్య (పెదనాన్న గారి అబ్బాయి) అక్కడికి వచ్చాడు. గబగబా జరిగిందంతా చెప్పి, దెబ్బలు తగిలిన ఆ కుర్రవాళ్లని అతనికి అప్పగించి రమ్య పరుగున వెళ్లి డాక్టరుగారికి పరిస్థితి అంతా వివరించి, ఆయన్ను ఇంటికి తీసుకెళ్లి నాన్నమ్మకి వైద్యం చేయించింది.

ఆ తరువాత జరిగిన విషయమంతా డాక్టరుగారికి చెప్పగానే ఆయన రమ్య సమయస్ఫూర్తికి, ధైర్యానికి ఎంతగానో మెచ్చుకున్నారు.

ఆమె అన్నయ్య కూడా ఆ కుర్రవాళ్లని

(తరువాయి భాగం 10వ పేజీ లో)

◆ వింత లోకం

బాడీ నాది... పచ్చబొట్టు మీది...

రోడ్ల మీద వాణిజ్య ప్రకటనల బోర్డులు కనిపిస్తుంటాయ్! కాకపోతే అందుకు డబ్బులివ్వాల్సి వుంటుంది సదరు యజమానులు. ఇదిగో ఈ బోర్డును ఇన్ని రోజులు వాడుకుంటే ఇంత డబ్బు కట్టాలి అన్నది పరస్పర ఒప్పందం. లాస్ ఏంజెల్స్‌కు చెందిన ఇల్మా గోస్ అనే అమ్మాయి తన బాడీనే బోర్డుగా మార్చేసింది. ఎవరైనా సరే పది డాలర్లిస్తే చాలు వారి పేరును పచ్చబొట్టు వేయించుకుంటుంది తన కాళ్ల మీద. పాతిక డాలర్లిస్తే దాత పేరుతో పాటు వారి నేస్తం పేరు కూడా కాలి మీద పచ్చబొట్టు వేయించుకుంటుంది. తొడల మీద పేరు వేయించుకోవాలంటే వెయ్యి డాలర్లు సమర్పించుకోవాలి. ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేయాలనుకుంటోంది ఇల్మా. నిజానికీమె రియల్ ఎస్టేట్ వ్యాపారి కూతురు. ఒకప్పుడు బాగా బతికినామే. వ్యాపారం అన్నాక ఓడలు నౌకలు కావడం నౌకలు ఓడలు కావడం చూస్తూనే వుంటాం. అలా ... ఆస్తులు పోగొట్టుకుని... నిలువ నీడ లేకుండా గడిపింది. అటువంటి పరిస్థితుల్లో ఆమెకు కన్పించిన మార్గం చిత్రలేఖనం. 'చిన్నతనంలో గోడల మీద బొమ్మలేస్తూ రాయొద్దని చెప్పేవారు ఇంట్లో పెద్దవాళ్లు. ఇవాళ గోడల మీద పొట్ట పోసుకోవాల్సి రావడం విచిత్రం. ఇకపోతే నా శరీరం మీద పచ్చబొట్లు వేయించుకోవడం అంటారా! సజీవ చిత్రాలకు సాక్ష్యాలవి' అంటోంది ఇల్మా.

మొహం మీద మొలకెత్తిన అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి మగవాళ్లు షేవింగ్ చేసుకోవడమే తెలుసు మనకు. ఈ మధ్య జపాన్‌లో మహిళలూ దానిపట్ల ఆసక్తి చూయిస్తున్నారట. ఆ ఆలోచన ముందుగా బ్యూటీ సెలూన్లవారి నుంచే వచ్చిందట. ఇప్పుడు దాదాపు సెలూన్లన్నిట్లో ఈ సౌకర్యం వుంది. కొందరు కేవలం కనుబొమల వరకే షేవ్ చేయించుకుంటుంటే... మరికొందరు మొత్తం శరీరమంతా చేయించుకుంటున్నారు. ' పైబడుతున్న తమ వయసును మగవాళ్లు కనిపించకుండా చూసుకోవడానికి ఎప్పటి నుంచో ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. షేవింగ్ క్రీమ్ వల్ల చర్మానికి తేమ అందుతుంది. షేవింగ్ చర్మానికి మర్దనలా కూడా ఉపయోగపడుతుంది. దీనివల్ల కేవలం వెంట్రుకలు మాత్రమే కాదు.... మృత కణాలు కూడా తొలగిపోతాయి. అలాగే మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళల అవాంఛిత రోమాలను కూడా షేవింగ్ ద్వారానే తొలగిస్తుంటాం" అన్నది సెలూన్ నిర్వాహకుల మాట. షేవింగ్ చేసిన వెంటనే వేడి నీటిలో ముంచి పిండిన మెత్తటి టవల్‌తో మర్దన చేస్తారు. అనంతరం వయసు కనిపించకుండా క్రీములు పూసి చివరిగా మేకప్ చేస్తారు.. మొత్తంమీద ఇంత వుంటుంది తతంగం. అయితే దీనికి తగ్గట్టుగానే పైసలు కూడా వసూలు చేస్తారనుకోండి! అయితే మొటిమలు వున్న వారు మాత్రం దీనికి దూరంగా వుంటే మంచిదని సెలూన్‌వాలాలు సూచిస్తుంటారు

మగువలకూ షేవింగ్

పైసలిస్తే పేరెడతారు

'తల్లిదండ్రులు కాబోతున్నాం' అన్న దగ్గర నుంచే పేర్లు వెతకనారంభిస్తారు. పుస్తకాలు, అంతర్జాలం..కాక చుట్టాలు పక్కాలను కూడా అడిగేస్తుంటారు. ఏదైనా మంచి పేరు చెప్పమని. వ్యాపారానికి కాదేదీ అనర్హం అన్న చందంగా... పేర్లు వెతికి పెట్టే కంపెనీ కూడా తయారైంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఈ కంపెనీ ... సదరు తల్లిదండ్రులకు కావాల్సిన పద్ధతుల్లో సరికొత్తగా ఆకర్షణీయంగా అర్ధవంతంగా వుండే పేర్లను సూచిస్తారు. అందుకోసం 32 వేల డాలర్లు వసూలు చేస్తారండోయ్. దీనికోసం కంపెనీ ఉద్యోగులు కొందరు రాత్రింబవళ్లు కష్టపడతారు. ఆయా వ్యక్తుల కుటుంబం, ప్రదేశం, సంస్కృతి... అన్నిటినీ దృష్టిలో వుంచుకొని మరీ పేర్లు సూచిస్తారు. ఒకవేళ వారు సూచించినవి నచ్చకపోతే మళ్లీ కొత్తపేర్లు కొన్ని తయారుచేస్తారు. వారికి నచ్చిన పేరు దొరికే వరకూ ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగుతుందట.

ఆ తృప్తి చాలు..

తిరుమల సుందర శ్రీ రంగనాథ్ మహిళలు మెచ్చిన అలనాటి కథానాయకుడు. ఆరడుగుల పొడవు...అందమైన ముఖ వర్చస్సు...గంభీరమైన వాచికం వెరసి విభిన్న పాత్రల కలబోత. విలక్షణమైన నటనతోపాటు భావుకతనూ కలిగిన వ్యక్తి. సామాజిక ఇతివృత్తాలపై తన స్పందనలను కవిత్వంలో ఇనుమడింపచేసుకున్న కవి రంగనాథ్. తన నలభై ఏళ్ల సినీ జీవితపు ప్రయాణంలోని మజిలీలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

నా నలభై ఏళ్ల సినీ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. మరెన్నో ఎత్తు పల్లాలను చూశాను. ఒకనాడు చలనచిత్ర పరిశ్రమ మొత్తం నన్ను హీరో అని భుజానికెత్తుకుంది. ఆనాడు అందలమెక్కింది లేదు. తర్వాత కథానాయకుడిగా అస్సలు అవకాశాలు రాలేదు. ఆ రోజు పాతాళానికి పోయింది లేదు. ఒక్క సినిమాలోనైనా నటుడిగా గుర్తింపు పొందితే చాలు అని మాత్రమే అనుకున్న నేను...సుమారు 300 చిత్రాలకు పైగా నటించాను. 50 చిత్రాల్లో హీరోగా చేసాను. 50 చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్రలనూ పోషించాను. ఇక విభిన్నమైన పాత్రలు, క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా నేటి వరకూ నా నటనా జీవితం కొనసాగుతూనే ఉంది. ఇన్నేళ్ల నా సినీ జీవితంలో శత్రువులంటూ ఎవరూ లేరు. అందరూ మిత్రులే. ఆ తృప్తి చాలు అవార్డులు దక్కలేదనో.. రావాల్సిన పేరు రాలేదనో అనుకోటానికి వీల్లేకుండా.

అమ్మ కోరిక

నేను మంచి నటుడుగా పేరు తెచ్చుకోవలన్నది అమ్మ కోరిక. మాది సామాన్య మధ్య తరగతి కుటుంబం. నాకు నలుగురు తమ్ముళ్లు. ఒక్కగానొక్క చెల్లెలు. మా అమ్మమ్మ, తాతయ్యలకు మగపిల్లలు లేకపోవడంతో నా బాల్యం అంతా వారి దగ్గరే గడిచింది. మా తాతయ్య మందసా మహరాజుల ఎస్టేట్‌లో డాక్టర్‌గా పనిచేసేవారు. మా ఇంట్లోవారంతా శాస్త్రీయ సంగీతంలో ఆరితేరిన వారు. మా అమ్మమ్మ చాలా బాగా పాడుతుంది. మా అమ్మ కూడా. నిజానికి మా అమ్మ సినిమాల్లో పాడాలని ప్రయత్నించింది. కానీ చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతల వల్ల ఆమె ఆశ తీరలేదు. తాతయ్య తన దగ్గరకొచ్చే పేద రోగుల గురించి, వారి కష్టాలు, రాజుగారు చేసే మంచి పనులు, దాన ధర్మాల గురించి నాకు కథలుగా చెప్పేవారు. వాటి ప్రభావం నాపై చాలానే ఉంది. ఎనిమిదో ఏటే నేను ముఖానికి రంగేసుకుని నాటక ప్రదర్శన ఇచ్చాను. అప్పుడే నా మనస్సులో మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలనే కోరిక పుట్టింది. అందుకోసం నా శరీరాన్ని నిరంతరం కాపాడుకోవడం, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం చేసేవాడిని. దీపావళి టపాసులు కూడా కాల్చేవాడ్ని కాదు. అవి ప్రమాదవశాత్తు నా పై పడి గాయాలైతే హీరోగా పనికిరాననే భయంతో. ఇక ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేరు నాన్న రిటైర్ అవ్వడం, కుటుంబ బాధ్యతలు పంచుకోవాల్సి రావడంతో సినిమా జీవితం అన్నది గ్యారెంటీ లేని బతుకు. లైఫ్‌లో సెటిలవ్వాలి అనే నిశ్చయానికొచ్చాను. ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాను. బి.ఎ చదువుతుండగానే దక్షిణ మధ్య రైల్వేలో టిక్కెట్టు కలెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. నెలకు రెండు వందల రూపాయల జీతం. వెంటనే చైతన్యతో పెళ్లి. మూడేళ్లు తిరగకుండా ముగ్గురు పిల్లలు. అలా సాగిపోతుండేది జీవితం. కానీ మనస్సులో మాత్రం నటుడవ్వాలన్న కోరిక అప్పుడప్పుడు తట్టిలేపుతుండేది. కొంత మంది మిత్రులం కలిసి 'వీణాపాణి' అనే నాటక సంస్థ ప్రారంభించాం. చాలా నాటకాలు రాసి, దర్శకత్వం వహించేవాడ్ని. రాజమండ్రిలో 'బుద్ధిమంతుడు' చిత్రం షూటింగ్ జరుగుతుంది. ఒక పాట చిత్రీకరణ కోసం లోకల్‌గా కొంత మంది నటుల కోసం వెదుకుతున్నారు దర్శకుడు బాపుగారు. మా నాటక సమాజంలో సంగీత బృందం వారికి ఆ అవకాశం వచ్చింది. వారు నన్నూ రమ్మన్నారు. అలా మొదటి సారి 1969లో టాటా గుడ్ బాయ్ అనే పాటలో ఫ్లూటు వాయిస్తూ మొదటిసారి వెండి తెరపై కనిపించాను.

చాలా సినిమాలు వదులుకున్నా

దర్శకుడు బాపు 'అందాల రాముడు' సినిమాలో స్థల పురాణం సన్నివేశంలో 'రాముడి వేషం ఉంది చేస్తావా?' అని అడిగారు. అదే సమయంలో చిత్రకల్పన వారి బ్యానర్‌లో హీరోగా అవకాశం వచ్చింది. ఇదే విషయం ఆయనకు చెప్పాను. హీరోగా పరిచయం చేస్తానంటే కాదనటం ఎందుకు, ఆ సినిమా ఒప్పుకోమని సలహా ఇచ్చారు ఆయన. అలా 'చందన' సినిమాతో తెలుగు చిత్ర సీమకు

కథానాయకుడిగా పరిచయమయ్యా. ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించి పెట్టింది మాత్రం 'పంతులమ్మ'. వాస్తవానికి నేను నటించిన చిత్రాలన్నీ మ్యూజికల్ హిట్స్. అవే నాకు మహిళాభిమానుల్ని సంపాదించి పెట్టింది. నన్ను చూస్తే తమ ఇంట్లో వ్యక్తిలా అనిపిస్తానని నేటికీ జనం అంటుంటారు . అందుకే సెంటిమెంట్ సీన్స్, కుటుంబ సంబంధాల సన్నివేశాలు పండించే పాత్రలకు చిరునామా రంగనాథ్ అంటారు. చాలా మంది. కానీ అది నా అదృష్టంగా భావిస్తాను. అవకాశం వచ్చిన ప్రతి సినిమా చేయలేదు. డబ్బు సంపాదించడం నా ధ్యేయం కాదు. నటనపై మక్కువతో ఈ రంగంలోకి అడుగుపెట్టానన్న సంగతి ఏనాడూ మరవలేదు. కథ, నా పాత్ర తీరు, దర్శకుడు, నిర్మాతల నిబద్ధత, వృత్తి బాధ్యత ఇవే సినిమా ఒప్పుకునే ముందు నేను చూసే విషయాలు. అందుకోసం చాలా సినిమాలు వదులుకున్నాను. హీరోగా రాణిస్తున్న సమయంలో ఏరియా డిస్ట్రిబ్యూషన్ అప్పుడప్పుడే చిత్ర సీమకు పరిచయమైంది. దాంతో అవకాశాలు సన్నగిల్లాయి. పరిస్థితి తారుమారైంది. కుటుంబ బాధ్యతలు మరింత పెరిగాయి. విలన్‌గా ఎందుకు చేయకూడదు అనిపించింది. హీరో కృష్ణం రాజుని సలహా అడిగాను. ఎందుకు చేయకూడదు. నిజానికి హీరో కన్నా విలన్ పాత్రలు చేసేవారే ఎక్కువ డబ్బు సంపాదిస్తారు అని చెప్పారు. అలా ఆయన నాకు 'గువ్వల జంట' సినిమాలో ప్రతినాయకుడి పాత్ర ఇచ్చారు. తమ్ముళ్ల చదువు, మంచంలో ఉన్న అమ్మమ్మ, తాతయ్య బాధ్యత అవన్నీ నేను హీరోగానైతేనే సినిమా చేస్తాననే అవకాశం ఇవ్వలేదు. ఎలాంటి పాత్రలైనా చేయాలి అనుకున్నా. అలానే వచ్చిన పాత్రలు చేసుకుంటూపోయా. నా కుటుంబ బాధ్యతలన్నీ నెరవేర్చా.

ఆ ఇద్దరిని అడిగాను

'ఖైదీ గారు' చిత్రం విడుదలైన తర్వాత ఓ రోజు రైల్లో రేపల్లె వెళుతున్నా. అప్పుడు చాలా మంది అభిమానులు నా దగ్గర కొచ్చి సార్ మీరంటే మాకు చాలా అభిమానం. ఖైదీగారు సినిమాలో మీ నటన చాలా బాగుంది. మీ పాత్రలు మాకు కన్నీరు తెప్పిస్తుంటాయి ఉక్కిరి బిక్కిరై వారంతా నాతో అంటుంటే క్యారక్టర్ ఆర్టిస్ట్‌గానైతేనేం విభిన్న పాత్రలు చేయాలనే దృఢ నిశ్చయం ఏర్పడింది. దాంతో ముత్యాల సుబ్బయ్య, కృష్ణా రెడ్డి గారిని నా జీవితంలో మొదటి సారి పాత్రలు ఇవ్వమని అడిగాను. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఎవ్వరినీ అడగలేదు. ఆ అవసరం రాలేదు. ఆ తర్వాత ఒక వాణిజ్య ప్రకటనలో నటించాను. అది నిజంగా నా రెండో ఇన్నింగ్స్‌కు చాలా ఉపకరించిందనే

◆ నాకు ఇష్టమైన ఆట టెన్నిస్. ఇంట్లో సుమారు 12 టెన్నిస్ బ్యాట్‌లుంటాయి.

◆ రోజూ సాయంత్రం టెన్నిస్ ఆడాల్సిందే. ఒక వేళ షూటింగ్‌ల వల్ల ఇంటికి చేరేసరికి అర్ధరాత్రో, అపరాత్రో అయిందంటే ఆ బ్యాట్‌లను తడిమి, వాటిని పలకరించికానీ నిద్రపోను.

◆ దర్శకత్వం వహించాలన్న కోరిక బలంగా ఉండేది. మొగుడ్స్-పెళ్లామ్స్ అనే సినిమాకు డైరక్షన్ చేసాను. అది ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దాంతో అలాంటి ప్రయత్నాలను విరమించుకున్నా.

చెప్పాలి. అది చూసే ఈటీవీ 'భాగవతం' సీరియల్‌లో బాపుగారు కంసుడి పాత్ర, రాఘవేంద్ర రావు 'శాంతి నివాసం' ఇలా బుల్లి తెరలోనూ అవకాశాలు వచ్చి... ప్రేక్షకులకు నన్ను మరింత దగ్గర చేసాయి.

తాతనయ్యాక ప్రేమలేఖ

మాది ప్రేమ వివాహం కాదు. పెద్దలు కుదిర్చిన పెళ్లే. మా ఆవిడ చైతన్య తను ఆరోగ్యంగా ఉన్నంతకాలం అలుపెరగని గృహిణి అనే చెప్పాలి. నేను సినిమాల్లో తీరికలేకున్నా నేను నిర్వర్తించాల్సిన కుటుంబ బాధ్యతలన్నీ తనే నిర్వహించింది. అప్పుడప్పుడూ నేను కవిత్వం రాస్తుండేవాడిని. రాసి ఆమెకు చదివి వినిపిస్తే మూతి విరిచి బాగానే ఉంది అంటూ మెలికలు తిరిగేది. నాకోసం ఎప్పుడూ రాయరా అని సరదాగా అడిగేది. మా పెద్దమ్మాయి కుటుంబం బెంగళూరులో ఉంటుంది.

ఆమె కాన్పు సమయంలో నెలరోజులు చైతన్య నాకు దూరంగా ఉండాల్సొచ్చింది. అప్పుడు అనిపించింది నా భార్యకు ప్రేమ లేఖ రాయాలని. అలా మా పెద్ద మనమరాలు పుట్టినప్పుడు నా భార్యకు మొదటి ప్రేమ లేఖ రాసా. ఎందుకు రాయాలనిపించిందో తెలియదు కానీ అలా రాయడం మాత్రం మా ఇద్దరి బంధానికి అదొక తీపిగుర్తు. తర్వాత కొన్నేళ్లకు బాల్కనీలో కాలు జారి పడి రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. 15 ఏళ్లు మంచంలోనే ఉంది. ఆమె నడిచి వెళ్లిన ఆఖరి వేడుక నటుడు నూతన్ ప్రసాదు గారింట్లోదే. ఆమె నాతో తరచూ అంటుండేది. నా మీద మీకు చాలా ప్రేమ. అందుకే నాకు మీరు సేవ చేస్తున్నారని. బాధ్యత ముఖ్యం. అదే ప్రేమను కలిగిస్తుంది అంటాను నేను. మాకు ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి. వారంతా స్థిరపడ్డారు. నా పెద్ద మనవరానికి వివాహం కూడా అయింది. ఇక ఖాళీ సమయాల్లో కవితలు, కథా రచన వ్యాపకం ఉండనే ఉంది.

వారిద్దరూ నాకు గురువులే

చిత్రపరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్నార్ వీరిద్దరూ నాకు ఆదర్శనీయులే. ఒకసారి రామారావు గారు దాసరి గారితో అన్నారట బ్రదర్ రంగనాథ్ గారు మంచి నటులు. అయితే వారు మంచి దర్శకుల చేతిలో పడలేదు అని. నాగేశ్వరరావు గారు కూడా ఒక సారి 'నాకు ఇష్టమైన నటుడు అశోక్ కుమార్. నటనలో ఆయన ఈజ్ మీలో కనబడుతుంది' అన్నారు నాతో. అంతకన్నా ఏం కావాలి. నాతో చాలా మంది అంటుంటారు. మీకు అన్యాయం జరిగింది. మీకు రావాల్సిన గుర్తింపు రాలేదు అని. కానీ అందుకు నేను అంగీకరించను. నా కెవరో అన్యాయం చేసారని అనుకోను. నటుడినైతే చాలనుకొని వచ్చిన నాకు, ఎన్నో రకాల పాత్రలు, అవకాశాలు వరించాయి. ఆ తృప్తి చాలు. పదవులపై వ్యామోహం లేదు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వారు ఎన్నో సార్లు ఎన్నికల్లో పాల్గొనమన్నారు. సున్నితంగా తిరస్కరించా. ఇక రాజకీయాల సంగతి కొస్తే నేను రాజకీయాలకు సరిపడని వ్యక్తిని అని నాభావన. అయితే వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ, నాయకుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ కవితలు, రచనలు చేస్తుంటాను. సామాజిక సమస్యలపై కూడా కలం ఝుళిపిస్తుంటాను. నేను స్పందించి రాస్తానే తప్ప రాయాలని రాయలేను. అందుకే నా కవితల్లో, రచనల్లో ఆర్తి కనబడుతుందంటారు చాలా మంది. ఈ మధ్య కాలంలో గోపాల గోపాల చిత్రంలో న్యాయమూర్తి పాత్ర తృప్తినిచ్చింది. కొన్ని చిన్న సినిమాలూ చేస్తున్నాను. అలా సాగుతోంది జీవితం.

ఇంటర్వ్యూ - శ్రీనాథ్ భూసిపాక

బహుముఖ స్పర్శ

తెలుగు పత్రికా రంగంలో సుదీర్ఘానుభవం, అపారమైన అధ్యయనం వున్న సంపాదకుడు ఎబికె ప్రసాద్. ఆయన అభిప్రాయాలతో ఏకీభవించలేనివారు కూడా తను అందించే సమాచారం లోతుపాతులను ప్రశ్నించలేరు. ఇంటర్నెట్ యుగానికన్నా ముందరి జర్నలిస్టు గనక పత్రికలు పుస్తకాలలో చదివిన ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకుని తన రచనల మధ్యలో ఇరికించి సమాచార సంపన్నం చేస్తుంటాడు. వాటిలో గణాంకాలూ, ఉటంకింపులూ దట్టిస్తుంటారు. అందువల్లనే వాటిని చదవడం ద్వారా పాఠకుడికి అనేక వనరులు ఒకేచోట అందుకున్నట్టు వుంటుంది. బహుశా తను చూసింది అందరికీ అందించాలనే సదాశయమే ఏబికెను ఇలా పురికొల్పుతుందని అనుకోవచ్చు.

ఆయన ప్రస్తుతం అందించిన పుస్తకం 'కాలంతో కరచాలనం' గత ఆరేడు సంవత్సరాలుగా 'సాక్షి'లో రాసిన వ్యాసాల సంకలనం. ఈ కాలం అనేక పరిణామాలు చూసింది. వైఎస్‌రాజశేఖర రెడ్డి మరణం, అనంతర రాజకీయ అస్థిరత్వం, రాష్ట్ర విభజన ఉద్యమం, విభజన, కేంద్ర రాష్ట్రాలలో ప్రభుత్వాల మార్పు, సరళీకరణ విధానాలు మతోన్మాద దాడులు తీవ్రం కావడం, అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం ఆధిపత్య వ్యూహాల వల్ల అనర్థాలు వంటివన్నీ ఈ కాలంలో మనం చూసిన పరిణామాలు. వీటన్నిటిపైనా ఎబికె ఆయా సమయాల్లో రాసిన వ్యాసాలను మనం ఇందులో చూడగలం.ఇందులోని నూట ముప్పై పైచిలుకు వ్యాసాలను తొమ్మిది భాగాలు విభజించారు. రాష్ట్ర విభజన ఉద్యమం, జాతీయ అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థికాంశాలు, రాజ్యాంగం చట్టాలు సిబిఐ గురించిన చర్చలు, పర్యావరణ సమస్యలు వంటివి సందర్భోచితంగా విశ్లేషించారు. అన్ని వ్యాసాల్లోనూ మతతత్వం సరళీకరణ సామ్రాజ్యవాదాలను ఎండగట్టడం సామాన్య సూత్రం. ఇక తెలుగు భాష ప్రాచీన హోదా వివాదం నేపథ్యంలో ప్రత్యేకించి భాషా సమస్యలపై ఆరు వ్యాసాలున్నాయి. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందే ఎలాంటి వివాదాలలో చిక్కుకుపోయి వున్నారో సాధికారికంగా తెలియాలంటే ఇందులో వ్యాసాలు చూడొచ్చు. మోన్‌శాంటో, రిలయన్స్ గ్యాస్, చావేజ్ విజయం, బీటీ వంకాయ, సిబిఐ విపరీత పోకడలు తదితర అంశాలు ఆకట్టుకుంటాయి. పదాల ఎంపికలోనూ పొందికలోనూ ఎబికె ఎంతశ్రమ తీసుకుంటారో కూడా ఈ వ్యాసాలు చెబుతాయి.

ఇక ఆయన రెండో పుస్తకం గ్రంథాలూ– కమామీషు' ఎందుకో ఈ టైటిల్ అంతగా నప్పలేదనిపిస్తుంది. ఇందులో దాదాపు నలభై పుస్తకాలపై తన సమీక్షలను సంకలితం చేశారు. కొన్ని ముందుమాటలూ వున్నాయి. ప్రతిదానికీ పూర్వాపరాలు, విలక్షణ స్వరాలు వెతికి చూపించారు. తాను సంపాదకుడుగా వుండగా ఆదివారం ఏదైనా పుస్తకాన్ని విశ్లేషించే సాహిత్యకీయాలు రాయడం ఎబికె పద్ధతి. వాటిని ఇదే పేరుతో పుస్తకంగా తెచ్చారు కూడా. వాటితో పోలిస్తే ఇవి సమీక్షలు గనక కొంత సంక్షిప్తత కనిపిస్తుంది. అయినా సరే వున్నమేరకు సమగ్రంగా పరిశీలించారు గనక పాఠకుడు అసంతృప్తికి గురికావలసిన అవసరం వుండదు. సమీక్ష ముందుమాట ఏది రాసినా ఏబికె ఆ రచయిత స్థానం ఏమిటి, తన రచనల ప్రత్యేకత ఏమిటి అన్నది నిగ్గు తేల్చడానికి ప్రయత్నిస్తారు. ఉదారంగానే ప్రశంసిస్తారు. పోలికలూ చూపిస్తారు. ఇందులో వివిధ తరాలకు చెందిన ప్రముఖుల రచనల పరామర్శ వుండటం ఒక ఆకర్షణ. నలభై పుస్తకాలు ఒకే వూపులో కానిచ్చేమనిపించుకోవాలంటే ఈ పుస్తకం చదివితే సరి.

- పీపీ



కాలంతో కరచాలనం, ఎ.బి.కె ప్రసాద్, పేజీలు: దాదాపు అయిదు వందలు, వెల: రు.220, ప్రతులకు: సుధా ప్రచురణ, హైదరాబాదుతో పాటు ప్రముఖ పుస్తకాల షాపులు.



గ్రంథాలూ- కమామీషు, ఎ.బి.కె.ప్రసాద్, పేజీలు: 260, ధర: 120 రూ. ప్రతులకు: కె.ఆర్.కె.ఎం.మెమోరియల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు ప్రచురించారు. 260 పేజీలు, విశాలాంధ్ర నవోదయలలో లభ్యం.

(6వ పేజీ కథ తరువాయి)

పోలీసులకి అప్ప చెప్పి రమ్య వాళ్లింటికి వచ్చి ఏ అవసరం వచ్చినా నాకు తప్పక ఫోన్ చెయ్యమని, ఇంటి దగ్గర వదిన ఒక్కరే ఉన్నారని తాను వెళ్లాలని అన్నాడు. డాక్టరుగారికి, అన్నయ్యకూ కృతజ్ఞతలు తెలియచేసి వాళ్లు వెళ్లాక తలుపులు వేసి, తల్లిదండ్రులకు ఫోన్ చేసి జరిగిందంతా వివరించి వాళ్లని కంగారు పడవద్దని చెప్పింది.తరువాత నాన్నమ్మ గదిలోకి వచ్చిన రమ్య 'డాక్టరుగారు ఇచ్చిన ఇంజక్షను ప్రభావంతో నొప్పి ఉపశమించినట్లుంది నాన్నమ్మకి' అనుకుంది ప్రశాంతంగా నిద్రపోతున్న ఆవిడని చూసి.

◆ ◆ ◆

తాను కరాటే నేర్చుకుంటానని ఎన్ని సార్లు అడిగినా తన తండ్రి మౌనంగా ఉండిపోవటం గమనించిన నాన్నమ్మ ఆఖరికి ఒకరోజు కలగచేసుకుని "ఆడపిల్లలకి చరిత్ర నేర్చుకోవటంతో పాటు చరిత్ర తిరగరాసే ధైర్య సాహసాలు కూడా ఉండాలి" అని తన తండ్రికి చెప్పి ఒప్పించింది. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఎక్కువగా కలుగచేసుకోని నాన్నమ్మ ఇంత లోతుగా ఆలోచించగలదా, ఇన్ని అభ్యుదయభావాలు కలదా అని అందరమూ ఎంతో ఆశ్చర్యపడిన మాట వాస్తవం. ఆ రోజు నాన్నమ్మ అలా తనకి అండగా నిలబడటం వల్ల తాను నేర్చుకున్న కరాటే ఇవాళ తన ఆత్మరక్షణకి ఉపయోగపడింది.అదంతా గుర్తుకురాగానే రమ్యకి నాన్నమ్మపై ప్రేమ మరింత పెల్లుబికింది. నిద్రపోతున్న ఆవిడ దగ్గరికి వెళ్లి దుప్పటి సరిగ్గా కప్పి, ఆవిడ నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూ మనసులోనే అనుకుంది రమ్య "థ్యాంక్స్ నానమ్మ" అని. ✦

సామాన్యుడి కథలు

తెలుగు కథ శత వసంతాలు పూర్తి చేసుకొంది. ఈ రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏదో ఒక చోట కథా సంపుటాలు, కథలు ప్రచురితమై, ఆవిష్కరణలు జరుగుతున్నాయి. కరుణాకర్ మూడు కథా సంపుటాలు వెలువడ్డాయి. అంబాలీస్, నిర్నిమిత్తం, రాజితం కథా సంపుటాల మీద విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ కథాసంపుటిలో అనివి, ఇరుకుపదును, ఎదురునీడ, ఏరివేత, కలికి కదలి, కన్నీటి నురుగు, కొసరు, గుర్తు, గమనిక, తూనికనీళ్లు, తూర్పురాయి, దోసెడు ఆకలి, నీటిపోగు, పొగ, నీటి ఉంగరం, ముళ్లమోపు, రెల్లు, లమం, సలోమి, సృతి, హార్ట్ గ్యాలరీ కథలున్నాయి.

రెల్లు కథలు
రచయిత : బి.పి.కరుణాకర్
పేజీలు : 128, వెల : 80 రూ
ప్రతులకు : బి.కె.ప్రసాద్, ఫ్లాట్ నెం: 304, అనూరాధ సదన్ అడిక్‌మెట్, హైదరాబాద్ 44
సెల్ నెం : 9290828575

చాలా కథలు ఇతర పత్రికల్లో ప్రచురణై పాఠకాదరణ పొందాయి (ప్రజాశక్తి స్నేహలోనూ ప్రచురణైనాయి). 'హార్ట్ గ్యాలరి' కథ ఇద్దర్ని ప్రేమించి...పెళ్లాడలేని ఒక ఉద్యోగిని కథ. శేఖర్, రఘుల మధ్య జరిగిన మానసిక ఘర్షణ...కుటుంబ నేపథ్యంలో ఐ.టి కంపెనీలో ఉద్యోగిని అంతరంగ ఆవిష్కరణే హార్ట్‌గ్యాలరీ. తనను కారుతో ఢీకొట్టిన కారు యజమానితో...పాదచారి, అన్నం కవరు...తన కుటుంబ సభ్యులకు అందించమని...తనకు యాక్సిడెంట్ అయిన సంగతి ఇంట్లో చెప్పవద్దు అన్న పాదచారి మాటలు...గుండెల్ని పిండేస్తాయి. ఆకలి గురించే బలమైన అభివ్యక్తితో రచయిత "దోసెడు ఆకలి" రాసారు. వాస్తవికతకు దగ్గరగా ఏ కథైనా ఉండాలి. 'తూర్పు రాయి' కథ...శిష్యుడ్ని పైకి తెచ్చిన ఉపాధ్యాయిని అంతరంగ ఆవిష్కరణ. అతని కాన్వొకేషన్ సభకు రాను అనే భార్య మాటలు లెక్కచేయకుండా...తాను ఒక్కడే వెళ్లే తండ్రి హృదయాన్ని ఆ ఉపాధ్యాయుడిలో చూస్తాం.

తండాలు...గిరిజన ప్రాంతాలు...అక్కడ రాజారత్నం, సరోజినీల ప్రభావం ఓ విద్యార్థిపై ఉండటం...అతని దొడ్డమ్మ, పెదనాన్నల ఇంటికి వెళ్లడంతో కథ ఆరంభం అవుతుంది. పోలీసులు...అన్నల మధ్య గొడవలు...ఇతివృత్తంగా సాగుతుంది "రెల్లు" కథాంశం. కథలో కొంత స్పష్టత కొరవడినా చదివించేగుణం వల్ల బాగా నడిచింది. చాలా కథల్లో బలహీనమవుతున్న మానవ సంబంధాలను విప్పి చెప్పే నేర్పును కరుణాకర్ ప్రదర్శించారు. వీరి కథల్లో శైలి, భాష, కథనంలో సంఘటనలూ పాత్ర వర్తనలో ఒదిగిపోయే సొబగుల్ని నింపుతూ ఉంటాయి. మనిషిని మార్కెట్ మాయాజాలం కప్పివేసి...డబ్బేసర్వస్వంగా మార్చే ప్రపంచీకరణ ఫలాలే అన్ని అనర్థాలకు కారణం అనే విషయాన్ని స్పష్టంగా చెపితే ఇంకా ఈ కథలకు బలం చేకూరేది.

రేషన్‌కార్డుల ప్రహసనాన్ని "ఏరివేత"లో చక్కగా చెప్పారు. లచ్చుమమ్మని వాస్తవ దృక్కోణంలో చెప్పిన తీరు బాగుంది. సామాన్యుడి అనుభవాలు, అనుభూతుల రసగుళికలు ఈ కథలు.

◆ కొత్త పుస్తకాలు

సరదాగా మరికాసేపు

రచయిత గబ్బిట కృష్ణమోహన్ కథల సంపుటికి 'రాంపా' ముందుమాట రాసారు. తెలుగు భాషలో పీ.జీ.వుడ్‌హౌస్ రచనల్ని అనువదించడంలో గబ్బిట కృష్ణమోహన్ గారిది ఓ ప్రత్యేక శైలి. ఈ రచనలు భూమి, నవ్య వార పత్రికల్లో ధారా వాహికలయ్యాయి. ఇందులో దాదాపు 10 కథలున్నాయి. అన్నీ చమత్కార హాస్య రంగవల్లులే!శ్రీరాముడికి అగ్ని పరీక్ష, ప్రణయ తాండవం, ఫ్లాష్ నొక్కే వాడి ఫ్లాష్‌బ్యాక్, సూపులో విషం, గౌతంరాజు, గరీబీ హఠావో, ఘరానా దోపిడి, భాగోతుల వారి నియమావళి, గతం పలకరించింది, పొగతాగని వాడు, బొంబాయిలో భూకంపం...ఈ కథలన్నీ నవ్వులు, హాస్యం అందించినవే. నిజానికి పీ.జీ.వుడ్‌హౌస్‌ని ఇంగ్లీషులో చదవాలి. ఆంగ్ల పాత్రలకు తెలుగు పేర్లు పెట్టడంతో గబ్బిట గుప్పిట పట్టారు. అన్ని కథల్లో హాస్యం, వ్యంగ్యం, చదివించే శైలి ఆకట్టుకుంటాయి. పేర్ల తమాషాగా ఉంటాయి. బీరాస్వామి, విస్కీశ్వర్రావు, పానకుటీరం, గౌతంరాజు, అపర్ణల ప్రేమ, ప్రణయం, పైడిరాజు పాత్రలు కథల్లో ప్రముఖంగా(వి)కనిపిస్తాయి. అన్ని కథలు గొలుసు సీరియల్‌లా అనిపిస్తాయి.

బి.బి.బి రాజు అంటే "భాగోతుల బొంబాయి భూకంపపు భూపతిరాజు" అనే పేర్లు హాస్యంగా అనిపిస్తాయి. మంజులత, నరసరాజుల ప్రేమాయణం...ఆ కథను సూతరాజు చెప్పడం(ముగింపు) బాగుంది. హాయిగా చదువుకోవచ్చు. అన్ని కథల్లో పాశ్చాత్య పెడధోరణులు కనిపిస్తాయి. ఈ కథలన్నీ టీనేజ్ యువకుల్ని ఆకర్షిస్తాయి. "ఇంపైన వుడ్‌హౌసు...సొంపైన తెలుగీసు...తెలుగు హాస్య ప్రియులకు...ఇంతకన్నా ఆనందమేమి?" అంటూ అట్టవెనుక ముళ్లపూడి వెంకటరమణ అభిప్రాయంతో పాటు పి.జి.వుడ్‌హౌస్ ఆటోగ్రాఫ్ ఫొటో ప్రచురించి ఈ పుస్తకం ప్రామాణికతను, ప్రాధాన్యతను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు పెంచారు. ప్రకటించారు. ఇవి నిజంగా సరదా కథాకథనాలే! గబ్బిట వారి ప్రయత్నం ప్రయోగాత్మకమే!



వుడ్‌హౌస్ కథలు
రచయిత : గబ్బిట కృష్ణమోహన్
పేజీలు : 210, వెల : 140 రూ
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జి.ఎస్.ఐ పోస్టు, హైదరాబాద్ 68,
ఫోన్ నెంబర్ : 040. 24224459

- తంగిరాల చక్రవర్తి

అక్షర సేద్యం



(కవిత్వం)
కవి:బైతి దుర్గయ్య
పేజీలు:70
వెల:రూ.75/-
ప్రతులకు: రాముని పట్ల గ్రామం చిన్నకోడూర్ మండలం, సిద్దిపేట, మెదక్ జిల్లా,సెల్: 9959007914

◆ స్వీకారం

మహాత్ముని సత్యాగ్రహాలు
రచయిత : కోడూరి శ్రీరామమూర్తి
పేజీలు : 118,
వెల : రూ.80
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



వింత జంతువులకు 'మసాయి మారా'

◆ యాత్ర

జీవితంలో ఒక ఆఫ్రికా దేశం చూస్తానని, ఆ విశేషాలని ఇలా అందరితో పంచుకుంటానని కాని ఎప్పుడూ అనుకోలేదు. అసలు నా కెన్యా ప్రయాణమే ఓ గమ్మత్తుగా అనిపించింది. 30 సంవత్సరాల పాటు ప్రింటింగ్ టెక్నాలజీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసి విశ్రాంతి తీసుకుంటున్న నన్ను, కెన్యాలో స్థిరపడ్డ నా పూర్వ విద్యార్థులంతా అక్కడికి రమ్మని ఆహ్వానించటంతో నేను నా మిత్రులుఆనంద్, సత్యనారాయణలతో కలిసి కెన్యాకి బయలుదేరాం.

- ధర్మవరపు నాగార్జున

తెల్లవారుజామున హైదరాబాదు నుండి ఖతర్ ఎయిర్ వేస్ విమానంలో కెన్యా రాజధాని నైరోబి చేరుకున్నాం. 23 డిగ్రీల ఉష్ణోగ్రత తో నైరోబి మాకు చక్కని వాతావరణ అనుభూతిని కలిగించింది. అక్కడి స్థానిక జింఖానా క్లబ్‌లో మాకు విడిది ఏర్పాటు చేశారు. దాదాపుగా ఇండియాలో ఉన్న వాతావరణమే అక్కడ కూడా కనిపించింది. నేను గమనించిన మరో ఆసక్తి కరమైన అంశం. ఇక్కడ దాదాపు అన్ని హోటల్స్‌లో బందా అనే సౌకర్యం ఉంది. బందా అంటే హోటల్లో విడిది చేసే అతిధులంతా వారి ఆహారాన్ని వారే వండుకోవచ్చు. దానికి అవసరమైన సామగ్రి అంతా హోటల్ వాళ్ళే ఇస్తారు. వారాంతపు సెలవల్లో 10 నుంచి 20 మంది కలిసి వచ్చినపుడు వండుకునే తింటారట. ఆడవారంతా ఇలా వంట చేస్తుంటే మగవారు కూరగాయలు, మాంసం కోసిపెడుతూ వారికి సాయపడుతుంటారు. ఈ బందా ఆసక్తి లేని వారికి అక్కడ ఉన్న రెస్టారెంట్‌లో కావాల్సింది తినే సౌకర్యమూ ఉంది.

మర్నాడు మా ముగ్గురికి కలిపి సఫారి ఏర్పాటు చేశారు. ఇది రెండు రాత్రులు, మూడు పగళ్ళు కొనసాగిన యాత్ర. ఆఫ్రికా వెళ్లేవారెవరైనా ఈ సఫారి చూడకుండా ఉండరు. నైరోబి నుంచి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'మాసాయి మారా' అనేది సఫారీకి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ప్రాంతం మా ప్రయాణం జోషువ అనే స్థానిక డ్రైవర్‌తో ఓపెన్ టాప్ వాహనంలో మొదలైంది. మొదటి 150 కిలోమీటర్ల వరకు చక్కటి రోడ్డు మీద ఎటువంటి కుదుపులు లేకుండా మా ప్రయాణం సాగింది. తరువాత 75 కిలోమీటర్లు అంతా గతుకుల రోడ్డు. ఆ తరువాత 25 కిలోమీటర్లు హోటల్‌కి మార్గం. సాయంత్రం 4 గంటలకి నైరోబిలో బయలుదేరితే ఆ హోటల్ కి చేరేటప్పటికి రాత్రి 7 గంటలు అయింది. ఆ హోటల్ పేరు మారాసింబా. ఆ హోటల్ చుట్టుపక్కల అన్నీ కోతులు, పక్షులు, జింకలతో పాటు ఒక పక్కన సన్నని నీటి కొలనులో రెండు మొసళ్ళు కనిపించాయి. మేము వచ్చే దారిలో అక్కడక్కడా జిరాఫీలు, జీబ్రాలు, లేడి పిల్లలు కనిపించాయి. అత్యంత విధేయతగా ఉండే జంతువులలో జిరాఫి కూడా ఒకటి. అలా అని తేలికగా తీసుకోకండి. జిరాఫీ కనుక ఆవేశంగా దాడి చేస్తే దాని ముష్టి ఘాతానికి సింహం అయినా కిందపడి చావాల్సిందే. అప్పుడే పుట్టిన జిరాఫి దాదాపు 6 అడుగులు ఉంటుంది.

మరుసటి రోజు ఉదయం జంతువులని చూడటానికి బయలుదేరాం. అదే హోటల్‌లో ఉంటున్న సందర్శకులతో మరో మూడు వాహనాలు మాతో బయలుదేరాయి. సఫారి డ్రైవర్‌లు, రేడియో ద్వారా ఒక డ్రైవర్‌కి ఎక్కడైనా ఎక్కువ జంతువులు కనపడితే ఆ సమాచారం మిగతా వారికీ ఇస్తాడు. వారంతా అక్కడికి చేరుకుంటారు.

ఎన్ని ఎక్కువ జంతువుల్ని చూడగలిగితే సఫారి అంత సక్సెస్ అయినట్లు. సఫారి మధ్యలో డ్రైవర్‌తో సహా ఏ యాత్రికుడు వాహనంలో నుంచి కాలు కింద పెట్టే సాహసం చెయ్యరు. ఇక్కడ అటవీప్రాంతమంతా మనకి పుస్తకాల్లో చెప్పినట్లు అంత దట్టంగా ఏమీ ఉండదు. కనుచూపు మేరలో విశాలమైన పచ్చిక బయళ్ళు. అక్కడక్కడా నీటి కొలనులు, వాటిలో నీళ్లు తాగుతూ పచ్చిక మేసే జంతువులతో కన్నుల



వ్యాసకర్త

“ఆ హోటల్ పేరు మారాసింబా. ఆ హోటల్ చుట్టుపక్కల అన్నీ కోతులు, పక్షులు, జింకలతో పాటు ఒక పక్కన సన్నని నీటి కొలనులో రెండు మొసళ్ళు కనిపించాయి. మేము వచ్చే దారిలో అక్కడక్కడా జిరాఫీలు, జీబ్రాలు, లేడి పిల్లలు కనిపించాయి. అత్యంత విధేయతగా ఉండే జంతువులలో జిరాఫి కూడా ఒకటి. అలా అని తేలికగా తీసుకోకండి. జిరాఫీ కనుక ఆవేశంగా దాడి చేస్తే దాని ముష్టి ఘాతానికి సింహం అయినా కిందపడి చావాల్సిందే.”

విందుగా ఉంటుంది. నేషనల్ జియోగ్రఫిక్ ఛానళ్ల షూటింగ్‌లు కూడా ఇక్కడ జరుగుతాయని జోషువా చెప్పాడు.

నక్కలు, జింకలు, ముంగిస, ఉష్ణపక్షి, రాబందు, అడవి మృగం, ఖడ్గ మృగం, చిరుతపులి, అడవి గేదె ప్రధానంగా చూసిన జంతువులు. ముఖ్యంగా ఖడ్గ మృగం మాకు వింతగా అనిపించింది. తల భాగం మేకని, శరీరం ఆవుని, కాళ్ళు జింక కాళ్ళు కంటే కొంచెం లావుగా, తోక మాత్రం గుర్రం తోకని పోలి ఉంది. మాసాయి మారాలో వీటి జనాభా ఎక్కువగా ఉంది.

ఇక్కడ అడవి గేదెల విషయానికొస్తే మనం మామూలుగా చూసే గేదెల కంటే భయంకరంగా ఉన్నాయి అవి. పదునైన కొమ్ములు, భీకరమైన ఆకారంతో కన్పించిన వాటిని చూడగానే ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది.

మాసాయి మారాలో ఉండేవాళ్లకి సింహాల కంటే ఇవంటేనే ఎక్కువ భయం.

అక్కడికి కొద్ది అడుగుల దూరంలోనే పచ్చిక మేస్తున్న జింక కనిపించింది. పొడవైన కొమ్ములతో అప్పుడప్పుడు నేలని పొడుస్తూ తిరుగుతోంది అది.

ఈ లోపు అక్కడికి మాసాయి గిరిజన తెగకి చెందిన కొంత మంది ఆడవాళ్ళు వచ్చారు. కెన్యన్లు చక్కటి ఇంగ్లీషు మాట్లాడతారు. గిరిజనులైన వారు చక్కటి ఇంగ్లీష్ మాట్లాడటం చూసి ఆశ్చర్యం వేసింది. వారు తయారు చేసిన కొన్ని వస్తువులని కొనమని అడిగారు. వారికి సాయం చేసినట్లు ఉంటుందని తలా ఒక బుట్ట కొన్నాము.

అప్పటికి సాయంత్రం 6.15 అయింది. అన్నీ చూశాం కాని అసలు అడవికి రారాజు సింహాన్ని ఇంకా చూడలేదు. అనుకుంటుండగానే ఓ సింహాల గుంపు రోడ్డుని దాటుతూ మా కంట పడింది. వాటిలో తల్లి, పిల్లలు ఉన్నాయి. తల్లి రోడ్డుని దాటి ఆవలకి వెళ్ళగానే పిల్ల సింహం మా వాహనాలని చూసి సందేహిస్తూ ఇవతలే ఉండిపోయింది. తల్లి సింహం వెనక్కి చూసి ఏమి ఫరవాలేదు రా అనట్లు సంజ్ఞ చేయగానే చకచకా రోడ్డు దాటేసింది. మరుసటి రోజున అక్కడ ఉన్న చిన్న చిన్న గ్రామాలు, వారి వ్యవసాయం చూసాము. మూడువ రోజున 7.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరురా అడవికి కాలినడకన బయలుదేరాం. 1080 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఆ దట్టమైన అడవిని చేరుకోవటానికి గంట పైనే పట్టింది. దారంతా మాట్లాడుకుంటూ నడవంతో మాకు అలసట తెలియలేదు. చానాళ్ళ తరువాత చెట్లు అందించే స్వచ్ఛమైన ఆక్సిజన్ ని పీల్చుకున్నాం అనిపించింది. వారం రోజుల పాటు సాగిన మా కెన్యా యాత్ర ఎన్నో మధుర జ్ఞాపకాలని అందించింది ✦

అడవి గేదె

'మసాయి మారా' అడవుల్లో అరుదుగా కనిపించే మృగం

బరువు దించుకుందాం

◆ అట్టమీది కథ

ఆరోగ్య సమస్యలకు హేతువు...జబ్బులకు చిరునామా ... వ్యాధుల పుట్ట...నూరేళ్ల ఆయుష్షుకు గండం...ఊబకాయం. ఇది ఎన్నో శారీరక, మానసిక సమస్యలకు పుట్టినిల్లు అవుతోంది. నేడు స్థూలకాయం సమస్య సమాజానికే పెనుసవాల్‌గా పరిణమిస్తోంది. గజిబిజి జీవనశైలి, బొత్తిగా ఒంటికి వ్యాయామం లేకపోవటం, గతితప్పిన ఆహారపు అలవాట్లు వెరసి అధిక బరువును పెంచిపోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికబరువు దించుకోవడం ఎలానో ఇవాల్టి అట్టమీది కథలో తెలుసుకుందాం!

డా॥ కాకర్లమూడి విజయ్

ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారిక లెక్కల ప్రకారం సుమారు 270 మిలియన్ల ప్రజలు మన దేశంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్నారు. ఇది నాణానికి ఒకవైపు. నాణానికి మరో వైపు చూస్తే ప్రపంచంలోనే అధికబరువు సమస్యతో బాధపడేవారి సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాల క్రమంలో భారత్ మూడోస్థానంలో ఉంది.. పూర్వం కొంచెం బొద్దుగా ఉన్నవారిని ఆరోగ్యవంతులుగా చూసేవారు. కానీ నేడు కాస్త బొద్దుగా ఉంటే, వారు ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని భయపడాల్సిన పరిస్థితి. అందుకు కారణం స్థూలకాయం. ఈ సమస్య కేవలం అందానికి, శరీర ఆకృతికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. అనేక రకాల జబ్బులకు పుట్టినిల్లు. ఈ సమస్యకు ప్రధానంగా జన్యుపరమైన లోపాలు, అనువంశికత, అదుపాజ్ఞలు లేని జీవనశైలి వల్ల పరిణమిస్తుంది.

శారీరక శ్రమకు దూరంగా

భారీకాయం పెరగటానికి ప్రధాన కారణం వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం. ఆధునికత పెరుగుతున్న కొద్దీ మనిషి సుఖజీవిగా మారిపోతున్నాడు. తను ఎలాంటి శారీరక శ్రమ అనుభవించకుండానే తనకు కావాల్సిన అవసరాలన్నీ తీరుతున్నాయి. మరీ ముఖ్యంగా నగరజీవనంలో శారీరక శ్రమన్నది పూర్తిగా కనుమరుగయ్యింది. ఎక్కడికి వెళ్లాలన్నా మోటారు వాహనాలు, విలాసవంతమైన సౌకర్యాలు...ఇవన్నీ మనిషిని మరింత బద్ధకస్తుడ్ని చేస్తున్నాయి. నిజానికి వ్యాయామం, క్రీడలు అన్నవి బాల్యంనుండే పిల్లలకు అలవాటు చేయాలి. మార్కుల కేంద్రాలు, ర్యాంకుల పరిశ్రమలుగా మారిన మన పాఠశాలల్లో కిక్కిరిసిన తరగతి గదులు తప్ప ఆటస్థలాలు లేకపోవడం. ఒకవేళ ఉన్నా, ఆటలాడటాన్ని సమయం వృధా చేయడంగా భావిస్తున్నాయి మన కార్పొరేట్ విద్యాసంస్థలు. దాంతో పిల్లలు ఉదయం నుండి సాయంత్రం వరకు సూర్యరశ్మి తగలకుండా అగ్గిపెట్టెల్లాంటి గదుల్లో మగ్గిపోవడంతో ...ముద్దుగా ఉండాల్సిన పిల్లలు, బొద్దుగా తయారవుతున్నారు. రకరకాల ఆరోగ్యసమస్యలకు గురవుతున్నారు.

రకరకాల ఒత్తిళ్లు

పెద్దల విషయానికొస్తే ఆఫీసులో పని ఒత్తిడి వల్ల అర్ధరాత్రి వరకు కంప్యూటర్లతో కుస్తీలు పడుతూ, ఉదయాన్ని ఆస్వాదించలేని వారెందరో. రోజుకు పదినుండి పన్నెండు గంటలు కూర్చొని పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు...నెలకు పెద్ద అంకెల సంపాదన ఉన్నా, కొద్దిరోజులకే నడుంనొప్పి, వెన్నెముక సమస్యలు, బరువు పెరగటం, అలసట వంటి రోగాలబారిన పడి వృత్తిజీవితంలో కూడా సరైన

ఉత్సాహం చూపించలేకపోతున్నారని గతంలో ఎన్నో సంస్థల సర్వేలు మొత్తుకున్నాయి. దాంతో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ ఆఫీసుల్లోనే జిమ్‌లు, షటిల్, వాలీబాల్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసి, ఉద్యోగుల్ని వ్యాయామం చేయమని ప్రోత్సహిస్తున్నాయి. మన దేశంలో ప్రతి ఐదు మంది స్త్రీ, పురుషుల్లో ఒకరు అధికబరువుతో బాధపడుతున్నారని ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. స్త్రీలలో కూడా ఈ సమస్య అధికంగానే ఉంది. ముఖ్యంగా తినే ఆహారం, రక్తహీనత, ఉపవాసాలు, పని ఒత్తిడి వల్ల మహిళలు అధికబరువుకు గురవుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అదుపు తప్పిన ఆహారశైలి

ఆహారపు అలవాట్లు అదుపు తప్పినవారి శరీరం కొవ్వుకు కేంద్రం అవుతుంది. నేడు మనం తినే ఆహారాన్ని ఒకసారి పరిశీలిస్తే...ఇప్పుడు విశాలమైన సూపర్‌మార్కెట్లన్నీ అధిక క్యాలరీల చిరుతిళ్లతో నిండిపోయాయి. అవి ఆకర్షణీయంగా ఉండటంతోపాటు సులభంగా దొరకటంతో ఎక్కువమంది నగరవాసులు వాటిని కొనుక్కుని తినటానికే ఇష్టపడుతున్నారు. ఇలాంటి కృత్రిమ వాతావరణం అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే కనబడేది. ఇప్పుడు మన దేశానికి కూడా పరిచయమైంది. ఉరుకులు పరుగుల జీవితంలో... ఒండుకుని తినే ఓపిక ఉండటంలేదు చాలామందికి. డబ్బులు పెట్టాలే కానీ అందుబాటులో దొరకని ఆహార పదార్థాలంటూ లేవు. పక్కనే జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, బేకరీలు పిలుస్తుంటాయి. కుండ బిర్యానీలు, బట్టర్‌నాన్‌లు నోరూరిస్తుంటాయి. పిల్లలైతే ప్రత్యేకంగా చాక్లెట్లు, చిప్స్ ప్యాకెట్లు, ,నూడుల్స్, చాట్‌మసాలాలనే తినటానికి ఇష్టపడతారు. వీటన్నింటిలో కొవ్వు శాతం ఎక్కువే. అంతేకాదు వీటిలో వాడే బట్టర్, చీజ్ వంటి వాటి వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాలు, ట్రైగ్లిజరైడ్స్ వంటివి పెరిగి గుండెకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

అర్ధరాత్రి భోజనాలతో చేటు

నేటి తరం టీనేజర్లు చాలా మంది అర్ధరాత్రి వరకు ఛాటింగ్‌లు, సెల్‌ఫోన్ కబుర్లతో కాలం గడుపుతున్నారు. ఉదయాన్నే నిద్రలేచే అలవాటుకు దూరమయ్యారు. దాంతో యువతలోకూడా పొట్ట పెరగటం, మానసిక రుగ్మతలు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మన శరీరంలోని జీవక్రియ అనేది సూర్యుని చుట్టూ తిరుగుతుంది.. రాత్రి పూట మన జీవక్రియ మందకొండిగా సాగుతుంది. పైగా మన శరీరం విశ్రాంతిలో ఉంటుంది. దాంతో క్యాలరీలు ఖర్చు కావు. రాత్రి భోజనం ఆలస్యంగా తినడం, అర్ధరాత్రి బిర్యానీలు తినడం, మద్యం తాగటం ఇలాంటి సంస్కృతి ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. చాలామందికి పొట్ట, తుంటి భాగాల్లో విపరీతంగా కొవ్వు పేరుకు పోవటానికి ఈ అలవాట్లే కారణం. ఉదయం 8 నుండి9 గంటల మధ్యలో కడుపు నిండా ఆహారం తీసుకోవచ్చు. రాత్రి ఏడు గంటల తర్వాత సాధ్యమైనంత వరకూ ఎలాంటి ఆహారాన్ని తీసుకోకపోవడం ఉత్తమం.

జబ్బుల ఫ్యాక్టరీ

అధిక బరువు వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంశపారంపర్యంగా, జన్యులోపాల వల్ల వచ్చే స్థూలకాయాన్ని డాక్టర్ల పర్యవేక్షణలో, స్వీయ క్రమశిక్షణతో అదుపులోఉంచవచ్చు. కానీ గతి తప్పిన జీవన శైలి వల్ల హార్మోన్ వ్యవస్థ పనితీరు మందగించడం, అదుపుతప్పటం జరుగుతుంది. దాంతో శరీరంలో మెటబాలిజమ్ వ్యవస్థ దెబ్బతింటుంది. అనేక వ్యాధులు రావడానికి కారణమవుతుంది. కొన్ని వ్యాధుల వల్ల బరువు పెరుగుతారు అని చాలా మంది అనుకుంటారు. కేవలం కొన్ని రకాల చికిత్సల్లో వాడే స్టెరాయిడ్స్ వల్ల, కొన్ని రకాల మానసిక సమస్యలకు వాడే మందులవల్ల మాత్రమే బరువు పెరుగుతారు. చాలావరకు బరువు ఎక్కువ వుండటం వల్ల వచ్చే రోగాలే ఎక్కువ. డయాబెటిస్, రక్తపోటు, కొన్ని రకాల క్యాన్సర్లు, గుండెజబ్బులు, శ్వాసకోస ఇబ్బందులు, కీళ్ల జబ్బులు, సంతానలేమి, మానసిక సమస్యలు ఇవన్నీ స్థూలకాయం తెచ్చే వ్యాధులు. కొన్ని సార్లు మూత్రపిండాలూ దెబ్బతింటాయి. అందుకే చాలా మంది స్థూలకాయులకు బెరియాట్రిక్ సర్జరీ సలహా ఇస్తున్నారు డాక్టరు. ఇది కేవలం అధికబరువుతో బాధపడేవారికి, బరువు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను నియంత్రించే ఒక మార్గంగా దీన్ని ఎంచుకుంటారు. చేయిదాటిన బరువును అదుపుచేయడానికి మాత్రమే ఈ సర్జరీ చేస్తారు.

ఆలోచించి తినాలి!

మనకున్న పెద్ద అలవాటు ఒకసారే పెద్దమొత్తంలో ఆహారాన్ని తీసుకోవడం. ఇలా ఒకేసారి ఆహారాన్ని పెద్దమొత్తంలో తీసుకోవడం వల్ల అది త్వరగా జీర్ణమై, ఎక్కువ ఆకలి వేయడానికి

ఇదొక వ్యాధి

డా॥ సత్యలక్ష్మి,
ప్రకృతి వైద్య కళాశాల,
హైదరాబాద్

ఈ మధ్య బ్రిటిష్ మెడికల్ జనరల్ ఒక పరిశోధన చేసింది. అదేంటంటే శరీరంలో పేరుక పోయిన కొవ్వు ఎలా బయటకు వెళుతుంది అని. శరీరంలోని కొవ్వు నీళ్లు, (చెమట, మూత్ర విసర్జన), మనం వదిలే గాలి ద్వారా బయటకు వెళుతుందని వారి పరిశోధనలో తేలింది. రోజులో నీళ్లు ఎక్కువగా తాగుతుండాలి. (సుమారు 4 నుండి6 లీటర్లు). యోగాలో కపాలభాతి, భస్త్రిక ఆసనాలు వేయడం వల్ల కూడా బరువు తగ్గుతారు. అన్నం బదులు, గోధుమ రొట్టె తినడం మంచిది అంటారు చాలా మంది. నిజానికి గోధుమల్లో 'గ్లూటెన్ అనే పదార్థం పేగుల్లో చాలా సమస్యలు సృష్టిస్తుంది. దాని బదులు జొన్న రొట్టె మంచిది. షుగరు, అధిక రక్తపోటు సమస్యలతో వచ్చే రోగులకు ముందుగా డాక్టర్లు, రోగుల అధికబరువును తగ్గించే విధంగా వైద్యం అందించాలని అమెరికాలో ఒక చట్టం చేయబోతున్నారు. ఇంకా మన దగ్గర అధిక బరువు అన్నది అందంతో ముడి పెడుతున్నాం. దీన్ని ఒక వ్యాధిగా గుర్తించాలి.

బిఎమ్ఐ

చాలా మంది వయస్సును బట్టి బరువుండాలని అనుకుంటారు. అది తప్పు. శరీర బరువు అనేది వ్యక్తి ఎత్తును బట్టి ఉండాలి. ఎంత ఎత్తుకు ఎంత బరువుండాలో సూచించే పద్ధతిని బాడి మాస్ ఇండెక్స్ అంటారు. ఒక వ్యక్తి శరీర బరువుని, అతని ఎత్తుని రెట్టింపు చేసి భాగిస్తే వచ్చే సంఖ్య బిఎమ్ఐ తెలుస్తుంది. బిఎమ్ఐ 18.5 నుండి 24.9 వరకు ఉంటే శరీర బరువు సాధారణంగా ఉన్నట్టు. 25 నుండి 29.9 మధ్యలో ఉంటే కొంచెం ఎక్కువ బరువు, 30 నుండి 34.9 అధిక బరువు, 35 నుండి అంతకన్నా ఎక్కువ స్థూలకాయంగా పరిగణిస్తారు.

తల్లి పాలు శ్రేష్ఠం

డా॥ జయంతి రమేష్
ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్

ఒత్తిళ్లు, శారీరక వ్యాయామం లేక పోవడం వల్ల హార్మోన్ వ్యవస్థను నడిపించే హైపో థలామస్ పనితీరు గతి తప్పుతుంది. దాంతో శరీరంలో జరగ వలసిన జీవక్రియ మందగిస్తుంది. స్టెరాయిడ్ హార్మోన్లు పెరిగి చెడు కొలెస్ట్రాలు, ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువ అవ్వడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అనేక వ్యాధులకు కారణమవుతుంది. ఇదంతా పొట్ట, అధిక బరువు ఉండటం వల్ల కలిగే సమస్యలు. వీటిని అధిగమించాలంటే ప్రజల్లో అవగాహన అవసరం. పుట్టిన పిల్లలకు కనీసం ఏడాది పాటు తల్లిపాలు ఇవ్వడం మంచిది. పాతపాలు పట్టించడం వల్ల వారు పెద్దయ్యాక ఊబకాయం సమస్య తలెత్తే అవకాశం ఎక్కువ.. చిన్నప్పటినుండే పిల్లల్లో తినే ఆహారం పట్ల, వ్యాయామం, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి. సరైన జీవనశైలితో జన్యుపరమైన, వంశపారపర్యంగా వచ్చే ఊబకాయం నుండ్లి బయట పడచ్చు.

కారణమవుతుంది. మనం ఎలాంటి ఆహారం తింటున్నాము? రోజులో ఏ ఏ పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నాము? మన శరీరం చేస్తున్న శ్రమకు తగ్గట్టుగా మన ఆహారం ఉంటుందా ? ఈ విషయాలను బట్టే మన ఆహార నియమాలు ఉండాలంటారు డాక్టర్లు. సాధ్యమైనంత వరకు తినే ఆహారంలో పీచు శాతం ఎక్కువుండేట్టు చూసుకోవాలి. పంచదార, అన్నం, గోధుమల్లో కార్బోహైడ్రైడ్లశాతం ఎక్కువ ఉంటాయి. వాటిని తక్కువ తీసుకోవడం మేలు. రోజులో ఆహారాన్ని ఒకేసారి పెద్దమొత్తంలో కాకుండా కొంచెం కొంచెంగా ఆహారాన్ని ఎక్కువసార్లు తినడాన్ని అలవాటు చేసుకోవాలి.

పీచు పదార్థాలు ఉత్తమం

పాలిష్‌డ్ బియ్యాన్ని, పొట్టు తీసిన పప్పు ధాన్యాల్ని వాడటం గొప్పగా భావిస్తాం. ఎక్కువసార్లు ప్రాసెసింగ్, రిఫైన్డ్ చేయబడిన ఆహారపదార్థాల్ని తీసుకోవడం వల్ల అవి త్వరగా జీర్ణమవుతాయి. అంతేకాక అవి కొంత మోతాదు తీసుకున్నా, అందులో అధిక పోషకాలు ఉండటంతో లావు పెరిగే అవకాశాలుంటాయి. వీలైనంత వరకు పొట్టు తీయని పప్పుధాన్యాల్ని, ముడిబియ్యం, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే రాగి, కొర్ర, సజ్జ, జొన్న తో చేసిన పదార్థాలను ఆహారంగా తీసుకోవడం ఉత్తమం. ప్రకృతిలో లభ్యమయ్యే పండ్లు, కూరగాయలను తినడం అలవాటు చేసుకోవాలి. మనం చేసే శారీరక శ్రమకు తగినవిధంగా ఆహారం తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు శరీరంలోని మెటబాలిజమ్ పనితీరును దెబ్బతీస్తుంది. సాధ్యమైనంత వరకు వాటికి దూరంగా ఉండాలి. ఊబకాయులు సహజంగానే తీపి ప్రియులు. వారు పంచదార వాడకాన్ని తగ్గించి, బెల్లం వాడటం మంచిది. చాలా మంది లావుతగ్గాలని డైటింగ్ పేరుతో లంకణాలు చేస్తారు. దాని వల్ల శరీరానికి కావాల్సిన శక్తి అందకపోవడంతో కీలకమైన అవయవాల పనితీరు మందగిస్తుంది. జీర్ణకోశ వ్యాధులు తలెత్తుతాయి. ఆహారం మానేయడం వల్ల లావు తగ్గుతారు అనేది పూర్తిగా అశాస్త్రీయం. ఆహార నియంత్రణ అన్నది కేవలం లావు పెరగకుండా ఉండటానికి మాత్రమే దోహదపడుతుంది.

సులువుగా తగ్గరు

రోజూ పొద్దునే వాకింగ్‌కు వెళ్లకూడదు. హాయిగా పొద్దెక్కినదాకా ముసుగుతన్ని గుర్రుపెట్టాలి. స్వీట్లు, బిర్యానీలు అసలే మానేయకూడదు. నచ్చిన రుచులన్నీ నాలుకపై ఆడాలి. కానీ బరువు తగ్గాలి. చాలా మంది బరువు తగ్గటానికి సులువైన మార్గాలు అన్వేషిస్తుంటారు. ఎవరైనా హేళన చేస్తేనో, బరువుపై క్లాస్ పీకితేనో అప్పుడు ఎలాగైనా సన్నబడాలని శబధాలు చేసుకుంటారు. ఒకే సారి లావు తగ్గటం అన్నది ఆరోగ్యానికి చాలా హానికరం. అసంభవం కూడా . ఎంత త్వరగా లావు తగ్గితే మళ్లీ అంతే త్వరగా లావు పెరిగే అవకాశం ఉంది. ఈ మధ్య కాలంలో చాలామంది లావుతో వ్యాపారం చేస్తున్నారు. మీరు సులువుగా బరువు తగ్గాలంటే. ఆహారం పూర్తిగా మానేసి మేము ఇచ్చే పౌడర్లు నీళ్లలో కలుపుకొని తాగితే చాలు, నాజూకైన నడుము మీ సొంతమని ప్రకటనలతో ఊరిస్తుంటారు. నిజానికి ఇవన్నీ మన సమస్యను పోగొట్టకపోగా, అనేక సమస్యలను సృష్టిస్తాయంటారు వైద్యరంగనిపుణులు. శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, పోషకాలు కావాలి. అవి మనం తీసుకునే రకరకాల ఆహార పదార్థాల ద్వారా మాత్రమే అందుతాయి. . అంతేకాని కృత్రిమంగా పొడులు, మాత్రల ద్వారా తీసుకోవడం అన్నది ఆరోగ్యానికి చేటు. అందుకే కేవలం శాస్త్రీయ పద్ధతిలో మాత్రమే బరువు తగ్గాలి.

నడకతో ఆరోగ్యం

చాలా మంది మేము మరీ అంత లావు లేము. వ్యాయామం చేయడం మాకు పనిలేదు అనుకుంటారు. ఇది ఒట్టి అపోహే అంటారు ఫిజికల్ ఫిట్‌నెస్ నిపుణులు. చిన్న, పెద్ద, ఆడ, మగ అందరూ ప్రతినిత్యం ఉదయం లేక సాయంత్రం కనీసం 30 నుండి 90 నిమిషాల వరకు కేవలం వ్యాయామానికి కేటాయించడం అవసరం. వ్యాయామం మనిషి శారీరక,

ఈ సర్జరీ అందరికీ కాదు

డా॥ లక్ష్మీకాంత్
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

లైపోసక్షన్ అనేది కేవలం ఒక భాగంలో మాత్రమే పేరుకుపోయిన కొవ్వును తొలగించేది. బెరియాట్రిక్ అనేది మొత్తంగా శరీర బరువును అదుపులో పెట్టేందుకు అన్నవాహిక పరిమాణాన్ని తగ్గించే ప్రక్రియ. కేవలం బాడీ మాస్ ఇండెక్స్ లో 37.5 శాతానికి మించి ఉన్నవారికి, 33 శాతం ఉండి అధిక బరువుతో వచ్చే సమస్యలతో ఇబ్బంది పడేవారికి మాత్రమే ఈ సర్జరీ చేస్తారు. కొంత మేరకు ఈ సర్జరీతో రిస్క్ ఉన్నప్పటికీ, అది అధిక బరువు వల్ల కలిగే సమస్యలకన్నా చాలా తక్కువ. చాలా మంది యువత త్వరగా లావు తగ్గాలి, మాకు బెరియాట్రిక్ సర్జరీ చేయండని వస్తారు. ముందు వారికి జీవనశైలి మార్పులు, వ్యాయామం వంటి విషయాలపై కౌన్సిలింగ్ ఇస్తాము. అవేవీ పనిచేయని పక్షంలో మాత్రమే సర్జరీ సలహా ఇస్తాము. బెరియాట్రిక్ చేసిన తర్వాత ఆహారనియమాలు, వ్యాయామం, మద్యపానానికి దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలి.

లావు, సన్నం ముఖ్యం కాదు

డా॥ శ్రీలక్ష్మి
మానసిక వైద్య నిపుణులు

లావుగా ఉన్నవారిలో మానసిక సమస్యలు ఎక్కువ. అధిక బరువు ఉన్నవారిని హేళన చేయడం, వారిపై జోక్స్ వేయడం వల్ల వారు చాలా వరకు ఇతరులతో కలివిడిగా ఉండలేరు. మిగతావారితో పోలిస్తే ఊబకాయుల్లోనే డిప్రెషన్, యాంగ్జైటి వంటి మానసిక సమస్యలు ఎక్కువ. వారిని వారు తక్కువచేసుకోవడం, అవతలివారు తమను చూసి ఎమనుకుంటారో అనే ఆలోచనలు వీరిలో ఎక్కువ. దాంతో వీరు వృత్తిజీవితంలో కూడా సరైన పాత్రను పోషించలేరు. అధికబరువుతో బాధపడేవారికి సమాజం నుండి ఇవ్వవలసింది ప్రేరణ. ఆ ప్రేరణను ఇంట్లోనుండి, స్నేహితులనుండి వచ్చినప్పుడు లావు తగ్గటానికి వారు ప్రయత్నించే అవకాశం ఉంటుంది. అంతేకాక సమాజంలోకూడా లావు, సన్నం అనికాకుండా మనిషి వ్యక్తిత్వానికి విలువ ఇవ్వడం ముఖ్యం.

అన్నం మానేస్తే తగ్గరు

డా॥భక్తియార్ చౌదరి
ప్రముఖ ఫిట్‌నెస్ నిపుణులు

అధిక బరువు ఉన్నవారు లావు తగ్గడానికి సులభమైన దారులు వెతుకుతుంటారు. త్వరగా ఫలితం కనబడాలని కోరుకుంటారు. ఇది అసంభవం. దైనందిన జీవనంలో మార్పులతోనే బరువు అదుపు చేసుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం కనీసం 30 నుండి 90 నిమిషాల సమయం వ్యాయామానికి కేటాయించాలి. మద్యం, ధూమపానం వంటి అలవాట్లను పూర్తిగా మానుకోవాలి. అన్నం మానేస్తే బరువు తగ్గుతారు అనుకోవడం అపోహ. నిజానికి ఆహార నియంత్రణ అన్నది బరువు పెరగకుండా చేస్తుందే తప్ప, బరువును తగ్గించలేదు. శరీరంలో ఉన్న కొవ్వుశాతాన్ని తగ్గించాలంటే తప్పనిసరిగా శారీరక శ్రమ ద్వారానే సాధ్యం. నెలకు సుమారు 1.5 కేజీల బరువు కన్నా ఎక్కువ తగ్గడం ఆరోగ్యానికి మంచిది కాదు.

మానసిక ఆరోగ్యాన్ని పరిపుష్టి చేస్తుంది. అయితే ఈ మధ్య కాలంలో నగరవాసుల్లో ఎక్కువమంది 40ఏళ్లు పైబడినవారంతా బరువుతో వచ్చే బాధలు తట్టుకోలేక ఉదయపు నడక, యోగ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి ఆటలు ఆడటాన్ని నిత్య జీవనంలో భాగం చేసుకుంటున్నారు. బరువు తగ్గటానికి ఈత మంచి వ్యాయామంగా పనిచేస్తుందట. గ్రామాల్లో కూడా మారిన జీవనశైలి ప్రభావంతో అధికబరువు సమస్య ఎగబాకింది. అయితే పల్లెటూర్లలో శారీరక శ్రమలేని జీవనం గడిపేవారిలో వ్యాయామం పట్ల అవగాహన తక్కువగానే ఉందని చెప్పవచ్చు.

సంకల్ప బలం

బరువు తగ్గటానికి బలమైన సంకల్పం ముఖ్యం. అందుకు చుట్టుపక్కల వారి ప్రేరణ తోడవ్వాలి. అధికబరువు వల్ల కలిగే అనర్థాలను అనుభవిస్తుంటారు. అది తెచ్చిపెట్టే తిప్పలను నిత్యం పత్రికల్లోనూ, టెలివిజన్లలోనూ తెలుసుకుంటూనే ఉంటారు. మనసులో కూడా బరువు తగ్గాలి అనే ఉంటుంది. కానీ అందుకు చిత్తశుద్ధి మాత్రం వెనక్కి లాగుతుంటుంది. బరువు తగ్గటానికి కేవలం అనువైన మార్గాలంటే జీవనశైలిలో మార్పులు, ఆహార నియమాలు పాటించటం, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం. ఇవి మాత్రమే లావు తగ్గటానికి ఆరోగ్యకరమైన పద్ధతులు.

ఆఫీసులో అర్థరాత్రి వరకు పనిచేశారు. అయినా సరే ఉదయం ఒక అర్థగంట వ్యాయామానికి కేటాయించండి. జిహ్వా రకరకాల రుచులను కోరుకుంటుంది. ఫర్వాలేదు. తినచ్చు. కానీ తినే పదార్థాల్లో కొవ్వు శాతం ఎంతుందో చూసుకోండి. నాలుగు రోజులు వాకింగ్ చేసి...ఐదోరోజు బద్దకంతో మానేశారు. ఫర్వాలేదు, ఆరో రోజు ప్రయత్నం కొనసాగించండి. ఇది ఒకరోజో, రెండు రోజులో చేయాల్సిన క్రతువు కాదు......నిత్యం జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన అలవాట్లు. ఇవి మాత్రమే బరువుని దించుకోవడానికి ఆరోగ్యకరమైన, సరైన మార్గాలు. ✦

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

(భాగం -22)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

మార్క్స్ వూహించినట్టుగానే అనిశ్చితి ఎంతోకాలం కొనసాగలేదు. ఇప్పుడు పత్రిక మనుగడే ప్రశ్నార్థకమైంది. ఎప్పుడూ అప్పులతోనే నడిచినా, ఇటీవల చందాలు కూడా ఆగిపోయాయి. అంతేకాక, డబ్బొచ్చే మరో మార్గం లేదు. పత్రికా నిర్వహణలో పాలుపంచుకున్న ఎంగెల్స్, బర్గర్స్, హెకర్, టాపస్‌లకు అరెస్ట్ వారెంట్‌లు జారీ అయ్యాయి. ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్రపన్నుతున్నారని అభియోగం.

లూపస్ దేశం విడిచి వెళ్లి, తిరిగి వచ్చి రహస్య జీవితం గడిపాడు. ఎంగెల్స్, బర్గర్స్ కూడా దూరంగా వెళ్లిపోయారు. కనీసం, అమెరికాకైనా పారిపొమ్మని కొడుకుని వేడుకుంది ఎంగెల్స్ తల్లి.

అయితే, అతడు అమెరికా బదులు బ్రసెల్స్ చేరుకున్నాడు. అక్కడ, అక్టోబర్ 4నాడు మరో మిత్రునితో కలసి ఒక హోటల్ కెళ్లినప్పుడు అరెస్టు చేశారు. ఆ తర్వాత, ఫ్రాన్సుకు బహిష్కరించారు. అక్కడా అరెస్టయ్యే అవకాశం లేకపోలేదు. అయితే, అంతకన్నా ముఖ్యంగా పారిస్ దీనావస్థను చూసి చలించిపోయాడు.

"శతఘ్ని దాడులతో పారిస్ ఆనందహేల అవిరైపోయింది. మార్సె (విప్లవగీతం) యిప్పుడు వీధుల్లో వినిపించదు. ఆహరమూ, ఆయుధాలూలేని కార్మికులు పళ్లు కొరుక్కుంటూ కనిపిస్తారు. నాకు తెలిసిన పారిస్ మరణించింది. ఇది పారిస్ కాదు. రోడ్ల మీద బూర్జువాలూ, పోలీసు గూఢచారులు మాత్రమే తిరుగుతారు. నాటకశాలలూ, నాట్యశాలలూ నిర్మానుష్యమైనాయి. ప్రాణంలేని పారిస్‌యిది. (అరెస్టు భయం లేకపోయినా) నేనిక్కడ వుండలేను. మొదట స్విట్జర్లాండ్ వెళతాను. డబ్బెక్కువగా లేదు. అందువల్ల కాలినడకన బయల్దేరుతాను. అక్కడికీ చేరటానికి దగ్గరదారి వెతుక్కోవటం లేదు. ఫ్రాన్సు నేలను వదలటానికి మనసు అంత త్వరగా అంగీకరించదు."

అలా, ఎంగెల్స్‌కు కొన్నాళ్లపాటు విప్లవం నుండి విరామం దొరికింది. ఇప్పుడతనికి యిరవై ఎనిమిదేళ్లు. లండన్‌లో పైలాపచ్చీసుగా తిరిగిన కుర్రాడు కాదు. అనేక మేధోపోరాటాలలో రాటుదేలిన యువకుడు. ధనికుడే కాని ప్రస్తుతం జేబు ఖాళీగా వుంది. అయినా విప్లవం పట్ల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. విప్లవంలో ఎలాగూ పీకల్దాకా మునిగాడు. ఇక తనకిష్టమైన మరొక కోరిక కూడా తీర్చుకోవటానికిదే సమయం!

ఫ్రాన్సులో ప్రయాణిస్తున్నప్పుడు అక్కడి వైన్‌లను వర్ణించటానికి మాటలు చాలలేదు. ఆ సందర్భంలో రాసిన "ఫ్రాన్స్ టు బెర్న్" వ్యాసంలో అవసరానికన్నా ఎక్కువ ఆశ్చర్యార్థకాలు ప్రయోగించాడు. అతడికి 'బర్గండీ' ప్రాంతం 'రెడ్ రిపబ్లిక్' గా కనిపించింది. అది కమ్యూనిస్టుల కంచుకోట ఏమీ కాదు. అక్కడి వీధులు వైన్ కలర్‌లో వుండటమే అందుకు కారణం. అలాంటిచోట సహజంగానే కోరికలు పెరుగుతాయి. డబ్బుంటే ఎంత బాగుండును! అనిపించింది. "1848 నాటి ద్రాక్ష దిగుబడి ఎంత ఎక్కువగా వచ్చిందంటే, వైన్ నింపటానికి బ్యారెల్స్ సరిపోలేదు". పైగా అది రుచికరమైన మధువు. ఉల్లాసంగా నడుస్తూ జెనీవా వైపు అడుగువేశాడు. చివరికి డబ్బులు కావాలంటూ మార్క్స్‌కు ఉత్తరం రాశాడు.

కానీ మార్క్స్ దగ్గర లేనిదేమిటీ అంటే అది డబ్బే. అప్పటికే 'న్యూ రైనిష్ జైటుంగ్' నడపటానికి తలమునకలవుతున్నాడు. కొలోన్ ముట్టడి ముగిసిన వారంరోజుల తర్వాత

" రాజులు, ఈ ఆర్థిక రహస్యం తెలుసుకున్నారు గనుక, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాలకు అంగీకరించారు. ప్రభుత్వానికి డబ్బులు ప్రవహించే కొళాయి పన్నుల వ్యవస్థ. దాన్ని మూసేస్తే ప్రభుత్వ కార్యకలాపాలు అగిపోవాల్సిందే. ఈ విషయాన్నే అక్టోబర్ 20 నాటి న్యూరైనిష్‌జైటుంగ్‌లో ప్రస్తావించాడు మార్క్స్. ప్రష్యన్ అసెంబ్లీకి ఇదే ఆయుధమైంది. "

అక్టోబర్ 12 నాడు పత్రిక తిరిగి ప్రారంభమైంది. కొత్త చందాలు రాలేదు సరికదా, పాతవాళ్లు పొడిగించలేదు.

రచనల కొరత తీర్చటానికి జార్జివీర్త్, ఫెర్డినాండ్ ఫైల్‌గ్రాత్ పత్రికలో చేరారు. సుఖంగా ఉన్న అపార్ట్‌మెంట్ నుండి మురికిగా ఉన్న పత్రిక ఎడిటోరియల్ గదుల్లోకి మారింది జెన్నీ-అంతటా ప్రింటింగ్ ఇంక్ కంపు. నూనె దీపాల వాసన. ఇవన్నీ భరించడమే కాదు. పత్రిక పనుల్లో కూడా సాయం చెయ్యాలి. అదీగాక, పార్టీకి చెందిన శరణార్థులకెప్పుడూ ఏదో ఒక అవసరముంటూనే వుంటుంది.

మార్క్స్ అరెస్టు అనివార్యమనే అనిపించింది. బారక్స్‌లో వున్న సైనికులు దాడి చేయటానికి అవకాశం కోసం నిరీక్షిస్తున్నారు. కాని మార్క్స్ దంపతులు ఈ విషయాలు ఆలోచించలేదు. దీనికో కారణం, జెన్నీ సోదరుడు ఫెర్డినాండ్ కావచ్చు. ప్రస్తుతం అతడు ప్రష్యన్ ప్రభుత్వంలో వున్నత హోదాలో వున్నాడు. తన చెల్లాయిని ఇదివరకు కూడా రక్షించాడు. ఫెర్డినాండ్ విషయంలో మాత్రం మార్క్స్ జెన్నీలవి భిన్నమైన అభిప్రాయాలన్నారు మిత్రులు. అతడు ప్రభుత్వతొత్తుగా వున్నాడని జెన్నీని చాలాసార్లు ఏడ్పించాడు మార్క్స్. కాని, ఎంతైనా అతడు జెన్నీకు అన్న. అభిమానం వుండకుండా ఎలా వుంటుంది! రాజకీయాలు ఇద్దరి అనురాగానికి అడ్డురాలేదు. భర్తకు నిజంగా ప్రమాదమే వస్తే అతడున్నాడని జెన్నీకి భరోసా!

కోలాన్ 1849

The revolution is dead!- Long live the revolution

- కార్ల్‌మార్క్స్.

తిరిగి ప్రచురణ ప్రారంభించిన న్యూ రైనిష్ జైటుంగ్, యూరోపులో

"కళ్ల ముందు కనిపించిన విషయాల్ని కూడా ప్రచురించకూడదంటే, ప్రతిరోజూ ప్రతి వార్తకూ కోర్టు అనుమతి తీసుకోవాలంటే, మంత్రిగారి నుండి పోలీసు కానిస్టేబుల్‌దాకా అందరూ అంగీకరించాకే ప్రచురించాలంటే, ఇక పత్రికా స్వాతంత్ర్యమనే మాటకే అర్థం లేదు. సందేహమెందుకు? పత్రికా స్వేచ్ఛను నిషేధించామని చెప్పండి. ఆ తర్వాత మేం నేరం చేశామని తీర్పు ఇవ్వండి".

కౌంట్ బ్రాండెన్ బర్గ్

విజయవంతమవుతున్న కౌంటర్ రివల్యూషన్ గురించి ప్రముఖంగా రాసింది. 1848లో అక్టోబర్ 6 నాడు జరిగిన దురదృష్టకర సంఘటన అది. హంగెరీలోని స్వాతంత్ర్య పోరాటాన్ని అణిచివేయటానికి ఆస్ట్రియన్ యుద్ధమంత్రి సైన్యాన్ని ఉపయోగించాడు. ఈ పరిణామంతో కోపోద్రిక్తులైన వియెన్నా కార్మికులు, విద్యార్థులు, అతణ్ణి బంధించి, సుత్తెలతో, ఇనప పైపులతో కొట్టిచంపి, పొడిచి, మృతదేహాన్ని లాంప్ పోస్ట్‌కు వేలాడదీశారు. చక్రవర్తి తక్షణమే పలాయనం చిత్తగించాడు. కాని ధనవంతులు, ప్రాణ భయమున్నా అక్కడే వుండక తప్పలేదు. నిరసనగా ప్రారంభమైన విద్యార్థి ఉద్యమం, కార్మికుల నాయకత్వంలో హింసాకాండకు దారి తీస్తుందని అనుకున్నారు. వెంటనే, ఈ అల్లర్లను ఉక్కుపాదంతో అణచివేయటానికి హంగేరీ నుండి బలగాలను రప్పించారు. చక్రవర్తిని తిరిగి సింహాసనం మీద కూర్చోపెట్టడం, ధనవంతులకు రక్షణ కల్పించటం వాళ్ల ఉద్దేశం.

నగరంలో యాభైవేల మంది కార్మికులు, స్టూడెంట్లు, నేషనల్ గార్డ్ సభ్యులు సైన్యంతో తలపడటానికి సిద్ధమయ్యారు. అందరినీ సాయుధం చేశారు. బారికేడ్లు నిర్మించారు. సరిహద్దుకు ఆవలివైపు డెభ్బైవేల సైనికులు ఆజ్ఞలకోసం నిరీక్షించారు. చివరికి అక్టోబర్ 28 నాడు అనుకున్నంతా జరిగింది. సైన్యం మారణాయుధాలతో వియెన్నా మీద దాడిచేసింది. నాలుగు రోజుల్లో యుద్ధం ముగిసింది. కార్మికుల, విద్యార్థుల కోపం శతఘ్నులను నిలువరించలేకపోయింది. మూడువేల మంది వియెన్నా పౌరులు, పదమూడు వందల మంది సైనికులు హతులయ్యారు. రెండు వేల నాలుగు వందల మందిని అరెస్టు చేశారు. ఇరవై అయిదు మందికి మరణశిక్ష అమలు చేశారు. ఆస్ట్రియన్ తిరుగుబాటు అంతమైంది.

ఇంతటి పాశవిక దాడిని నిశ్శబ్దంగా భరించిన మధ్య తరగతి పట్ల కోపంతో వూగిపోయాడు మార్క్స్.

"జూన్, అక్టోబర్ నెలల్లో నిష్కారణంగా జరిగిన మారణకాండలు, ఫిబ్రవరి, మార్చిలనాటి ఆత్మత్యాగాలు, కౌంటర్ రివల్యూషన్ ప్రదర్శిస్తున్న "నరమాంస భక్షక" స్వభావం వల్ల ఒక విషయం స్పష్టమవుతుంది. ఇప్పుడెవరికీ ఎలాంటి సందేహమూ లేదు. పాత సమాజ మరణ వేదనను అంతమొందించటానికి విప్లవ ప్రతి హింస-రివల్యూషనరీ టెర్రర్- తప్పనిసరి" అని రాశాడు తన పత్రికలో.

అయితే, హింస అనివార్యమని చెబుతున్నప్పటికీ, అది పరిష్కారం కాదన్న విషయం కూడా స్పష్టమే. సైన్యం ముందర నిరసనలూ, బారికేడ్లూ నిష్ప్రయోజనమని తేలిపోయింది. కాయకష్టం చేసే కార్మికులు, సుశిక్షితమైన సైన్యంతో, దాన్ని బలపరిచే ధనిక వర్గంతో, ప్రభుత్వంతో యుద్ధం చేసి గెలవలేరు. మాటలతో రెచ్చగొట్టినా, వాస్తవ పరిస్థితులను సరిగానే అర్థం చేసుకున్నాడు మార్క్స్. పన్నుల రూపంలో సాక్షాత్కరించిందా సత్యం. ప్రజలందరూ ప్రభుత్వం మీద ఆధారపడి వున్నారని అనుకుంటారు. కాని నిజానికి ప్రభుత్వానికి ప్రాణం పోస్తున్నది ప్రజలే. ప్రజలు పొలాల్లో, కార్మికులు ఫాక్టరీల్లో, వ్యాపారస్తులు షాపుల్లో పని చేస్తే, షిప్పులు, రైళ్ల సరకులు రవాణా చేస్తేనే ప్రభుత్వం నడుస్తుంది. అంతేకాదు, ప్రజల వుత్పాదకతతోనే ప్రభుత్వానికి మనుగడ. రాజ భవనాలు, పార్లమెంట్లు, సైన్యం అన్నీ ప్రజలు కట్టే పన్నులతోనే సాధ్యం. అంతే ప్రజలు కట్టే పన్నులు లేకుండా ప్రభుత్వం ఒక్కరోజు కూడా కొనసాగలేదు. ప్రజలు, తమను నిర్బంధించే జైళ్లను, సంకెళ్లను తామే కొనుక్కుంటున్నారు.

రాజులు, ఈ ఆర్థిక రహస్యం తెలుసుకున్నారు గనుక, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాలకు అంగీకరించారు. ప్రభుత్వానికి డబ్బులు ప్రవహించే కొళాయి పన్నుల వ్యవస్థ. దాన్ని మూసేస్తే ప్రభుత్వ కార్యకలాపాలు ఆగిపోవాల్సిందే. ఈ విషయాన్నే అక్టోబర్ 20 నాటి న్యూ రైనిష్ జైటుంగ్‌లో ప్రస్తావించాడు మార్క్స్. ప్రష్యన్ అసెంబ్లీకి ఇదే ఆయుధమైంది.

నవంబర్ 9 నాడు కొత్త ప్రధానమంత్రి కౌంట్‌బ్రాండెన్‌బర్గ్, ప్రష్యన్

నేషనల్ అసెంబ్లీని బెర్లిన్ నుండి, మరో చిన్నవూరు బ్రాండెన్ బర్గ్‌కు బదలాయించాడు. ఈ విషయమై, నిరసనలు వెల్లువెత్తకుండా వుండాలని నలభై వేల మంది సైనికులను కాపలాపెట్టి బెర్లిన్‌ను ముట్టడి చేశారు. నిస్సహాయులైన అసెంబ్లీ సభ్యులు తమకు ఓట్లేసిన పౌరుల్ని, అసెంబ్లీ తిరిగి బెర్లిన్‌కు వచ్చిందాకా పన్నులు కట్టవద్దని సూచించారు.

ఆ తర్వాత, నవంబర్ 17 నుండే ' no more taxes ' అనే పతాక శీర్షిక తన పత్రికలో రోజూ ప్రచురించాడు మార్క్స్. మరో యిద్దరు మిత్రులు షాపర్, ష్నైడర్ కూడా ఈ పిలుపును సమర్థిస్తూ సంతకాలు చేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే, ప్రజల్లో తిరుగుబాటు భావాలు రెచ్చగొడుతున్నారనే అభియోగం మీద మార్క్స్, షాపర్, ష్నైడర్‌లను కోర్టులో ప్రవేశపెట్టారు. అభియోగానికి సాక్ష్యం కూడా లభించింది. బాన్ నుండి డసెల్ డార్ఫ్ దాకా నిరసనకారులు 'పన్నులు కట్టొద్దు' అని మంత్రం జపిస్తూ, ప్రభుత్వ పన్నుల సేకరణ కేంద్రాల మీద దాడులు చేశారు. (ఈ పిలుపు మద్దతు సంపాదించింది గాని ప్రభుత్వానికి పెద్ద ప్రమాదమేమీ రాలేదు). చట్టపరంగా మార్క్స్ మీద ఒత్తిడి పెరిగింది. దేశద్రోహం నేరం మోపారు. పరువునష్టం దావావేసి మరోసారి కోర్టుకు లాగారు. మార్క్స్ అరెస్టు తథ్యమన్న వదంతులు వ్యాపించాయి. అయినా, తను ప్రభుత్వ వ్యతిరేక రచనలన్నీ ప్రచురించటం ఆపనని స్విట్జర్లాండ్‌లో వున్న ఎంగెల్స్‌కు రాశాడు మార్క్స్. "ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగిపోకూడదు. పత్రికా హక్కుల్ని అన్ని రకాలా పరిరక్షించుకుందాం".

మార్క్స్, కోర్టులలో యుద్ధాలు కొనసాగిస్తుంటే, రాజుగారు తొమ్మిది నెలల క్రితం ఏర్పాటైన ప్రష్యన్ నేషనల్ అసెంబ్లీని రద్దు చేసి,

"ఎంగెల్స్‌కు కొన్నాళ్లపాటు విప్లవం నుండి విరామం దొరికింది. ఇప్పుడతనికి యిరవై ఎనిమిదేళ్లు. లండన్‌లో పైలాపచ్చీసుగా తిరిగిన కుర్రాడు కాదు. అనేక మేధోపోరాటాలలో రాటుదేలిన యువకుడు. ధనికుడే కాని ప్రస్తుతం జేబు ఖాళీగా వుంది. అయినా ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. విప్లవంలో ఎలాగూ పీకల్దాకా మునిగాడు. ఇక తనకిష్టమైన మరొక కోరిక కూడా తీర్చుకోవటానికిదే సమయం!"

ప్రసంగిస్తున్న ఎంగెల్స్, పక్కన మార్క్స్

తన కొత్త రాజ్యాంగం ప్రకారం ప్రజల హక్కులు కాలరాయటానికే, యుద్ధం ప్రకటించటానికే అధికారం చేపట్టాడు. ఇది సైనిక తిరుగుబాటు కన్నా తక్కువేమీ కాదన్నాడు మార్క్స్.

మొత్తం మీద రాజుగారి ఈ చర్యతో, దేశంలో ప్రతిపక్షం అనేది లేకుండా పోయి, రాజుగారికి తన స్థానం సుస్థిరమనిపించింది తాత్కాలికంగా.

◆ ◆ ◆

1849 జనవరి నాటికి, ఎంగెల్స్ తిరుగు ప్రయాణానికి పరిస్థితులు అనుకూలంగా మారాయి. అరెస్టుల భయంతో ఇతర దేశాలకు వెళ్లిన మిత్రులు తిరిగి వచ్చి న్యూ రైనిష్ జైటుంగ్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించారు. ప్రభుత్వం వాళ్లమీద ఆరోపణల్ని ఉపసంహరించుకుంది. కోర్టు యుద్ధాలలో మార్క్స్ పక్కన నిలబడాలనుకున్నాడు ఎంగెల్స్.

క్రితం సంవత్సరం రాసిన ఒక వ్యాసం గురించి పరువునష్టం దావా కోసం ఫిబ్రవరి 7 నాడు కోర్టుకు హజరైన మార్క్స్, ఎంగెల్స్ కిక్కిరిసిన కోర్టురూంలో ప్రసంగించారు. "ప్రజల హక్కుల్ని కాపలా కుక్కలా కాపాడటం పత్రికల విధి. అధికారంలో వున్నవాళ్లని విమర్శించాలి. నిఘానేత్రం క్షణం కూడా రెప్ప వేయకూడదు. ఇది ప్రజల గొంతు". పత్రికలో ప్రచురించిన వ్యాసం ఈ బాధ్యతనే నిర్వర్తించిందన్నాడు మార్క్స్. ఈ సమస్యను చారిత్రక నేపథ్యంలో విశ్లేషిస్తూ మార్క్స్ "విప్లవం ఎందుకు విఫలమైంది? ఉన్నతస్థాయి రాజకీయ వర్గాలకే పరిమితమైంది. కింది అంచెలలో వున్న పాత బ్యూరోక్రసీ, పాత సైనికాధికారులు, పాత న్యాయవ్యవస్థ మాత్రం చెక్కు చెదరలేదు. నిజమైన రాజసేవకులు వీళ్లే. ఈ పునాదుల్ని పెకలించటమే పత్రికలు చెయ్యాల్సిన పని" అంటూ ముగించాడు. కరతాళధ్వనులతో మార్మోగింది హాలు.

పరువు నష్టం అభియోగాన్ని తిప్పికొట్టిడం ఇక ఎంగెల్స్ వంతు. "విధి నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు తాగివున్నారు". ఏ పోలీసు అధికారి పేరూ చెప్పలేదుగనక అభియోగానికి అర్థం లేదు. అంతేకాక ప్రత్యక్ష సాక్షి కథనాన్నే తాము యథాతథంగా ప్రచురించారు.

"కళ్లముందు కనిపించిన విషయాల్ని కూడా ప్రచురించకూడదంటే, ప్రతిరోజూ ప్రతి వార్తకూ కోర్టు అనుమతి తీసుకోవాలంటే, మంత్రిగారి నుండి పోలీసు కానిస్టేబుల్‌దాకా అందరూ అంగీకరించాకే ప్రచురించాలంటే, ఇక పత్రికా స్వాతంత్ర్యమనే మాటకే అర్థం లేదు. సందేహమెందుకు? పత్రికా స్వేచ్ఛను నిషేధించామని చెప్పండి. ఆ తర్వాత మేం నేరం చేశామని తీర్పు ఇవ్వండి".

ముగ్గుర్నీ నిర్దోషులుగా ప్రకటించింది న్యాయస్థానం.

సశేషం

▪ ఫోన్: 91776 18708

◆ సమ్‌థింగ్ స్పెషల్

ముందు ఉరి తదుపరి విచారణ

కోర్టులలో జరిగే విచిత్రాల గురించి అనేక సందర్భాలలో చదివి ఉంటారు. దీన్ని చదివి ఏమంటారో చెప్పండి. అమెరికాలోని ఓక్లహోమా రాష్ట్రంలో చార్లెస్ వార్నర్ అనే నేరస్థుడికి గతనెల 15న ఉరిశిక్ష అమలు జరిపారు. ఆ రాష్ట్రంలో ఉరి అంటే ఇంజెక్షన్ ద్వారా కొన్ని ఔషధాలు శరీరంలోకి ఎక్కించి చంపటమే. ఇంజెక్షన్ ఇచ్చినపుడు శరీరం బాధకు గురి అవుతుంది, అమానుషంగా ఉరి తీయటం చట్టప్రకారం నిషేధం కనుక ఆ పద్ధతిలో ఉరితీతను నిలిపివేయాలని చార్లెస్ అప్పీలు చేసుకున్నాడు. అదే రాష్ట్రంలో మరో ముగ్గురు ఉరిశిక్ష పడిన ఖైదీలను జనవరి 29, ఫిబ్రవరి 19, మార్చి 15న ఉరితీయాల్సి ఉంది.

అక్కడి చట్టాల ప్రకారం అలాంటి విన్నపాలపై విచారణ జరపాలంటే కనీసం ఐదుగురు న్యాయమూర్తుల అంగీకారం అవసరం. వార్నర్ ఉదంతంలో నలుగురే అంగీకరించారు కనుక ఐదో అంగీకారం లేదనే కారణంతో సుప్రీం కోర్టు అప్పీలును కొట్టివేసింది. దాంతో చార్లెస్‌ను నిర్ణీత తేదీ ప్రకారం ఈనెల 15 ఉరితీశారు. దీనిపై విమర్శలు, వివాదం చెలరేగింది. మిగిలిన ముగ్గురు ఖైదీలు కూడా అలాంటి పిటిషన్లే దాఖలు చేశారు. నలుగురు న్యాయమూర్తులు అంగీకారం తెలిపినపుడు శిక్షను నిలిపివేయకపోయినా పరిశీలించవచ్చన్న అంశం ఉండటంతో అంతకు ముందు సుప్రీం కోర్టు తిరస్కరించిన చార్లెస్ కేసును విచారించేందుకు అంగీకరించింది. దీంతో తాత్కాలికంగా అయినా మిగిలిన ముగ్గురి ఉరి నిలిచిపోయింది. అయితే ఐదుగురు న్యాయమూర్తుల అంగీకార సమస్య ఒకటి ఉండనే ఉంది. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో సుప్రీం కోర్టు అంగీకరించటంతో సాంకేతికంగా ఐదవ జడ్జి ఏదో అవసరార్థం సరే అనే అవకాశం ఉంది. అయితే సుప్రీం కోర్టు అప్పీలుపై అంతిమంగా ఏ విధంగా స్పందిస్తుందో తెలియదు.

కొన్ని రాష్ట్రాలు ఉరిశిక్ష అమలుకు కొన్ని ఔషధాల మిశ్రమాన్ని విషంగా ఇచ్చినపుడు నేరస్థులకు కలిగే బాధపై విచారణ జరపనుంది. కేసు అప్పీలులో ఉంది కనుక తీర్పు వచ్చేంత వరకు మిగిలిన ముగ్గురి ఉరిని వాయిదా వేసేందుకు అనుమతించాలని ఓక్లహోమా అటార్నీ జనరల్ కోర్టును కోరారు. మరణించేటపుడు బాధలేని విధంగా ఔషధాల మిశ్రమం గురించి సలహా ఇస్తే ఆమేరకు అమలు జరుపుతామని పేర్కొన్నారు. ఆ రాష్ట్ర చట్టాల ప్రకారం గవర్నర్ 60 రోజుల వరకు వాయిదా వేయవచ్చు. అయితే సుప్రీం కోర్టు అంత వ్యవధిలో విచారణ పూర్తి చేసే అవకాశం లేదు. అందువల్లనే ప్రభుత్వం స్టే కోరింది. ఏప్రిల్ నెలాఖరు వరకు కోర్టు విచారణ చేపట్టే అవకాశంగాని, జూన్ ఒకటవ తేదీలోగా నిర్ణయం వెల్లడించే పరిస్థితిగానీ లేదు.

రెండు రాష్ట్ర కోర్టులు ఓక్లహోమా రాష్ట్రంలో ఉరితీసే ప్రక్రియ రాజ్యాంగ బద్ధమే అని గతంలో తీర్పు చెప్పాయి. తాజా పిటిషన్ రాజ్యాంగ సమస్యగా మారింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఒక నేరస్తుడిని వివిధ ఔషధాల మిశ్రమంతో ఉరి తీసినపుడు ఇంజెక్షన్ చేసిన తరువాత 43 నిమిషాలకు మరణించాడు. ఓక్లహోమాతో పాటు మరికొన్ని రాష్ట్రాలలో మూడు దశలుగా ఔషధాన్ని ఎక్కించి ఉరిశిక్ష అమలు జరుపుతారు. తొలుత మత్తుమందు, తరువాత అవయవాలు పనిచేయకుండా, చివరగా గుండె ఆగిపోయే ఔషధం ఇస్తారు. ఈ ప్రక్రియలో వినియోగించే 'మిడాజోలమ్' అనే ఔషధం ఎక్కించే సమయంలో ఖైదీ ఎంతో నొప్పిని అనుభవించినట్లు గతేడాది అరిజోనా, ఓహియో రాష్ట్రాలలో సాక్షులు చెప్పారు.

గతంలో ఉరికి గాను పెంటోబార్బిటల్, థియోపెంటాల్ అనే ఔషధాలను వినియోగించే వారు. అయితే వాటిని తయారు చేసే కంపెనీలు తమ ఔషధాలను ఉరితీతకు వినియోగించేందుకు తిరస్కరించాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉరి తరువాత ఓక్లహోమా కొంతకాలం మిడాజోలమ్ వినియోగాన్ని నిలిపివేసింది. అయితే ఈనెలలో వార్నర్‌కు వినియోగించి తిరిగి ప్రారంభించింది. దీంతో ఆ చర్య వివాదాస్పదమైంది. వార్నర్ ఉరి ప్రక్రియకు 18 నిమిషాలు పట్టిందని, అయితే అతను అంతగా నొప్పిని అనుభవించినట్లు తమకు అనిపించలేదని ఆ సమయంలో అక్కడే ఉన్న జర్నలిస్టులు చెప్పారు. అయితే ఇంజక్షన్ చేస్తున్న సమయంలో తన ఒళ్లు మండుతోందని చెప్పినట్లు, ఐదు సార్లు కదిలినట్లు తెలిపారు.

గతంలో సుప్రీం కోర్టు ముందు ఇదేమాదిరి కేసు 2008లో వచ్చింది. మూడు ఔషధాలు కలిపి ఇంజెక్షన్ ఇచ్చి ఉరి అమలు జరపటం అమానుష, అసాధారణ చర్యకిందకు రాదని కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి ఎన్నో మార్పులు వచ్చాయని నిందితుల తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. గతంలో ముందుగా ఇచ్చే ఔషధంతో ఖైదీ కోమా మాదిరి స్థితిలోకి వెళతాడని, అవి ఇప్పుడు దొరకటం లేదని వాటి బదులు మిడాజోలమ్ వినియోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే దీనిని ఓక్లహోమా రాష్ట్ర సర్కార్ అంతకంటే సులభంగా ప్రాణం తీసేది మరొకటి లేదని, కోర్టు అనుమతిస్తే దానిని కొనసాగిస్తామని కూడా తన పిటిషన్‌లో పేర్కొన్నది. ఏప్రిల్ 29న సుప్రీం కోర్టు విచారణ ప్రారంభం అవుతుంది.

- సత్య

ఏమేం జంతువులున్నాయ్?

ఈ చిత్రవిచిత్రమైన ప్రాణిలో రెండు రకాల జంతువులున్నాయి.
అవి ఏంటో చెప్పుకోండి.

జవాబు : పంది, కుందేలు

పది తేడాలేవి?

ఈ బొమ్మలు రెండూ చూడ్డానికి ఒకేలా వున్నాయా?
కానీ పది తేడాలున్నాయి. మరి అవేంటో కనిపెట్టి చెప్పండి.

గుర్రం గీద్దామా



దాక్కున్నది ఎక్కడోచ్

ఈ బొమ్మలో కొన్ని బొమ్మలు దాక్కున్నాయి. అవంటే బుజ్జోడికి చాలా ఇష్టం. కనిపెట్టండి త్వరగా. ఇంతకీ ఆ బొమ్మలు ఏమంటే... కొబ్బరి చెట్టు, చేప, పాము, తాళం, తాబేలు, పైన్‌ఆపిల్, చిలుక.

నా బొమ్మ



ఎం. రాహుల్, ఆరవ తరగతి, సెంట్రల్ పబ్లిక్ స్కూల్, విజయవాడ.

సందడే సందడి



వంకాయ పెళ్లి కుదిరింది
కూరగాయల సందడి చూడండి
ఆనకపకాయ రంగులు వేసింది
మునగకాయ ముగ్గులు పెట్టింది
పాలకూర పందిరి వేసింది
అరటికాయ అన్నం పెట్టింది
బంగాళ దుంప బజ్జీలు చేసింది
తమలపాకు తాంబూలమిచ్చింది
జామకాయ జడలు వేసింది
పనసపండు పూలు పెట్టింది
బత్తాయి బట్టలు తెచ్చింది
బెండకాయ బ్యాండు కొట్టింది
టమాటా తాళి కట్టింది
ఉల్లిపాయ ఊరేగించింది
నన్నూ పిలిచారని
గుమ్మడికాయ గంతులు వేసింది

పాట తమాషాగా వుంది కదూ.
ఇందులో మొత్తం ఎన్ని రకాల కూరగాయలు వున్నాయి?

జవాబు : పన్నెండు

ఆ ఆరు పదాలను కనుక్కోండి!

leaf, warm, bug, egg, bunny, bee, frog, bird

F	A	E	L	B	E	E
R	N	G	O	U	X	U
O	U	G	L	N	O	R
G	X	R	U	N	O	T
A	I	K	H	Y	U	L
R	I	D	R	I	B	G
C	I	E	H	E	E	U
W	A	R	M	E	E	B

అక్షరాల బాక్సులో పైన ఇచ్చిన ఆరు పదాలు దాక్కున్నాయి.
వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.

తెలుగు పదాలతో ఆట

సేవము	సా	కు						
పోలిక	సా	మ్య	ము					
సముద్రము	సా	గ	ర	ము				
చక్రవర్తి	సా							
ధైర్యంగా చేసేపని	సా							
సమభావము	సా							
పనిముట్టు	సా							
నానుడి	సా							
సంవత్సరము	సా							

జవాబు:సాకు, సామ్యము, సాగరము, సార్వభౌముడు, సాహసకృత్యము, సామరస్యము, సాధనము, సామెత, సాలు

ఈ సీజన్‌లో వేడివేడి రసం తాగినా అన్నంలో కలుపుకుని తిన్నా హాయిగా ఉంటుంది. ఈ వివిధ రకాల రసాలు ప్రయత్నించి చూడండి

ఊరించే రసాలు

అల్లం రసం

కావాల్సిన పదార్థాలు
అంగుళం అల్లం ముక్క, పచ్చి మిరపకాయ, కొద్దిగా చింతపండు, చిటికెడు మెంతులు, టీ స్పూన్ జీలకర్ర, చిటికెడు ఇంగువ, కరివే పాకు, పసుపు, ఉప్పు, టీస్పూన్ నెయ్యి.

తయారుచేసే పద్ధతి
ఐదు కప్పుల నీరు, అల్లం ముక్కను తీసి దంచాలి. పాత్రలో నెయ్యి వేడిచేసి మెంతులు, మినపప్పు, ఆవాలు, జీలకర్ర వేసి పోపు పెట్టాలి. పప్పు రంగు మారాక పచ్చి మిరపకాయ ముక్కలు, ఇంగువ, కరివేపాకు వేసుకోవాలి. ఐదు కప్పుల నీరుపోసి మరగనిచ్చి అల్లం కలపాలి. మూత పెట్టి మరో రెండు నిమిషాలపాటు ఉంచాలి.

ఉలవ రసం

కావాల్సిన పదార్థాలు
రెండు కప్పుల నీరు, ఒక కప్పు ఉలవలు, నాలుగు ఎండు మిరపకాయలు, అర టీ స్పూన్ మెంతులు, రెండు టీ స్పూన్లు ధనియాలు, చిటికెడు ఇంగువ, రెండు టేబుల్ స్పూన్లు నూనె, చింతపండు, పసుపు, రెండు పచ్చి మిరకాయలు, కరివేపాకు ఆరు వెల్లుల్లి రేకలు.

తయారుచేసే పద్ధతి
సువాసన వచ్చేదాకా ఉలవల్ని వేయించాలి. కొద్దిగా నూనెలో ఎండుమిరపకాయలు, ధనియాలు మెంతులు, జీలకర్ర, ఇంగువ వేసి వేయించుకోవాలి. ఈలోగా రెండు కప్పుల నీళ్లు పోసి ఉలవల్ని కుక్కర్‌లో ఉడికించాలి. చల్లారాక మసాలాలు ఉడికించిన ఉలవలు చింతపండు కలిపి బ్లెండ్ చేసుకోవాలి. రసం మాదిరి పల్చగా అయ్యేందుకు కావాల్సిన నీరు పోసి పసుపు, ఉప్పు కలిపి మరగనివ్వాలి. పచ్చి మిరపకాయలు నిలువుగా కోసి వేసుకుని కొద్దిసేపు దింపేయాలి. ఓ పాత్రలో నూనె వేడి చేసి ఎండు మిరపకాయ, ఒక టీ స్పూన్ ఆవాలు, కరివేపాకు వేసి చిటపటలాడాక చిదిమిన వెల్లుల్లి రేకలు వేసి వేయించాలి. ఈ తాలింపును రసంలో వేసి కలియబెట్టాలి.

నిమ్మ రసం

కావాల్సిన పదార్థాలు
మూడు టేబుల్ స్పూన్లు కందిపప్పు, రెండు కప్పులు నీరు, ఒక టీ స్పూన్ అల్లం తురుము, ఒక పచ్చి మిరపకాయ, చిటికెడు ఇంగువ, పావు స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ రసం పొడి, రెండు టేబుల్ స్పూన్లు నిమ్మ రసం, తగినంత ఉప్పు, రెండు టీ స్పూన్లు నెయ్యి, ఒక టీ స్పూన్ జీలకర్ర, కొత్తిమీర.

తయారుచేసే పద్ధతి
రెండు కప్పుల నీళ్లు పోసి కందిపప్పు ఉడికించుకోవాలి. పసుపు ఇంగువ, నిలువుగా చీలిక చేసిన పచ్చి మిరపకాయ, అల్లం తురుము, ఉప్పు కలిపి, మధ్యస్థంగా ఉండేఊ సెగపై మరగనివ్వాలి. రసంపొడి కలిపి మరో నిమిషం ఉండాలి. సెగ పూర్తిగా తగ్గించి నిమ్మరసం కలిపి దింపేయాలి. నెయ్యి వేడి చేసి, జీలకర్ర వేసి చిటపటలాడాక ఈ తాలింపును రసంలో వేసి కలియబెట్టాలి. కొత్తి మీర ఆకులు జల్లుకోవాలి.

అనాస రసం

కావాల్సిన పదార్థాలు
అరకప్పు నీళ్లు, రెండు కప్పులు తాజా పైనాపిల్ ముక్కలు, ఒక టీ స్పూన్ చింతపండు గుజ్జు, ఒకటిన్నర స్పూన్లు రసంపొడి. చిటికెడు ఇంగువ, రెండు పచ్చి మిరపకాయ ముక్కలు, అరటీ స్పూన్ ఆవాలు, కరివేపాకు, తగినంత ఉప్పు, ఒక టీ స్పూన్ నూనె, కొత్తి మీర.

తయారుచేసే పద్ధతి
పాన్‌లో ఒక టీ స్పూన్ నూనె వేడి చేసి, ఆవాలు వేసి చిటపటలాడాక ఇంగువ, రసం పొడి, వెల్లుల్లి ముక్కలు, కరివేపాకు వేసుకోవాలి. చింతపండు గుజ్జును అరకప్పు నీటిలో కలిపివేయాలి. పైనాపిల్ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి ఉడకనివ్వాలి. తగినంత నీరు పోసి మరగనిచ్చి, కొత్తిమీరతో అలంక రించుకోవాలి.

రోబో పెట్!



ఇంట్లోకి అడుగెట్టగానే తోకాడిస్తూ వెంట తిరిగే పెంపుడు జంతువులు కావాలని కోరుకునేవారెందరో! వాటితో ఆడుకుంటూ సేద తీరాలని ఆశపడే వారికి కొదవే లేదు! అయితే వాటికి సమయానికి తిండి పెట్టడం, వాకింగ్‌కి తీసుకెళ్లడం, ఒకటి రెండుకెళితే శుభ్రం చేయడమే కష్టం. ఇంట్లో పెట్ వుండాలంటే ఈ రెంటికీ సిద్ధపడాలి. అదేం కుదరదంటే... పెట్‌ను పెంచుకోవాలన్న కోరికా తీరదు. అయితే ప్రతి దానికీ ఒక పరిష్కారం వుంటుంది కదా. అవే మీ ముందు కొలువు తీరింది. వీటితో ఎలాంటి సమస్యా వుండదు. ఇష్టమైనప్పుడు ఆడుకోవడం...ముద్దు చేయడం... బై చెప్పడం. బస్! మిగతా జంఝాటాలేవీ వాటితో వుండవు. అయితే...ఈ బొమ్మలేంటి ... పెంపుడు జంతువులేంటి? అనిపించక మానదు. ఇవి రోబోలు. పెంపుడు జంతువుల్లా నడుచుకునే యంత్రాలు. రోబో పగ్ డాగ్ ...యజమానిని చూసి తోకాడిస్తుంది. గారాంగా మొరుగుతుంది. ఎముక నోట్లో పెట్టుకుని పరుగెడుతుంది. ఇక రోబో డైనోసార్ సంగతి! ఇది మనం విసిరేసిన బంతిని స్మార్ట్‌గా నోటితో పట్టేసుకుంటుంది. 'కీట్' అనే పక్షిని చూసి ఫిదా అవని వారుండరు. ఇది చక్కగా మాట్లాడుతుంది. డాన్స్ చేస్తుంది. రెక్కలాడిస్తుంది. తన బొమ్మ బండి నడుపుతుంది. ఎవరికి మాత్రం నచ్చదు చెప్పండి. ఇక మాట్లాడే చిలక కూడా వుంది. ఇది మనం అన్న మాటనే తిరిగి తియ్యగా పలుకుతుంటుంది. ఈ రోబో ఒక్కోటి 40 పౌండ్ల నుంచి ధర పలుకుతుంది. బ్రిటన్‌లో వీటి తయారీ, కొనుగోళ్లు జోరుగా వున్నాయనుకోండి. ●

బ్రష్షు బొమ్మాళి

కుంచె జీవితకాలం బహు తక్కువ. మహా అయితే ఇంటికో, బడికో, గుడికో, కార్యాలయానికో రంగు వేసినంత కాలమే. ఆ తర్వాత దాని కేరాఫ్ అడ్రస్... ఏ చెత్తబుట్టలోకో, అటక మీదకో మారుతుంది. మరంతే కదా! వాడేసిన బ్రష్షు గురించి ఎవరు మాత్రం ఆలోచిస్తారు?! వాటి పనైపోయినట్టే భావించేస్తాం. కానీ కాలిఫోర్నియాకు చెందిన 'రెబెకా సిటో' రూటే వేరు! వాటిని అత్యంత అపురూపంగా సేకరిస్తుందావిడ. వాటినే కాదు. శాండ్ పేపర్లనూ భద్రంగా పోగేస్తుంది. ఆయిల్ పెయింట్లు, సన్నపాటి ఇనుప తీగలు కూడా ఆవిడకు అపురూపమే. వీటన్నిటికి తన సృజనాత్మకతను జోడించి ఇదిగో చిలాంటి బొమ్మాళి బొమ్మలు తయారు చేసేస్తుంది. విశేషం అనుకోండి. విచిత్రం అనుకోండి. ఆవిడ బొమ్మలన్నిట్లో ఆడవాళ్లు, పిల్లలే వుంటారు. పురుషులు చూద్దామన్నా కనిపించరు. బ్రష్షుకి వుండే వెంట్రుకలనే రంగురంగుల వస్త్రాలుగా మలిచేస్తారు. మొత్తం మీద ఒక్కో బ్రష్ నుంచి ఓ చక్కని ఆర్ట్ పీస్ తయారైపోతుంది. తను రూపొందించిన బ్రష్షు బొమ్మలతో ఇప్పటికి ఎన్నో ఆర్ట్ గ్యాలరీలు నిర్వహించి చూపరులను అబ్బురపరచింది రెబెకా. ●

రెబెకా